ప్రజాశక్తి
మంగళవారం 9 సెప్టెంబర్ 2025
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

విశాఖకు పర్యాటక శోభ

- కైలాసగిరిపై సిద్ధమైన గ్లాస్ బ్రిడ్జి
- ఇప్పటికే అందుబాటులోకి వచ్చిన హెలికాప్టర్ మ్యూజియం, డబుల్ డెక్కర్ బస్సులు



కైలాస గిరిపై నిర్మించిన గ్లాస్ బ్రిడ్జి



డబుల్ డెక్కర్ బస్సు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

సరికొత్త పర్యాటక ప్రాజెక్టులతో విశాఖ నగరం మరింత శోభను సంతరించుకుంటోంది. కొద్ది రోజుల క్రితం ప్రారంభమైన హెలికాప్టర్ మ్యూజియం, డబుల్ డెక్కర్ బస్సులకు తోడు త్వరలో అందుబాటులోకి రానున్న గ్లాస్ బ్రిడ్జి నగరానికి కొత్త సొబగులు అద్దుతోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, ఎపి టూరిజం శాఖ సంయుక్తంగా విశాఖపట్నంలో పలు పర్యాటక ప్రాజెక్టులపై దృష్టి సారించాయి. విశాఖ నగరాన్ని పర్యాటక రంగంలో అగ్రగామిగా నిలిపేందుకు సన్నాహాలు చేస్తున్నాయి. ఈ క్రమంలోనే ఇటీవల కాలంలో ఎంవిపి.కాలనీ అప్పుఘర్ వద్ద ఉన్న హరిత రిసార్ట్‌ను రూ.13.5 కోట్లతో ఆధునికీకరించి వినియోగంలోకి తీసుకొచ్చారు

గ్లాస్ బ్రిడ్జితో గాల్లో తేలియాడే అనుభూతి

ప్రముఖ పర్యాటక ప్రాంతమైన కైలాసగిరిపై దేశంలోనే అతి పొడవైన (55 మీటర్లు) క్యాంటీ లివర్ గ్లాస్ స్కైవాక్ బ్రిడ్జిని దాదాపు రూ.7 కోట్లతో విఎంఆర్‌డిఎ ఆధ్వర్యాన నిర్మించారు. దీని పై నుంచి సముద్రాన్ని వీక్షించడంలో కలిగే థ్రిల్లే వేరు. సందర్శకులకు గాల్లో తేలియాడే అనుభూతి లభిస్తుంది. ఒకేసారి 40 మంది దీనిపై నిల్చొని ప్రకృతి అందాలను వీక్షించే సామర్థ్యాన్ని కలిగి ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ నెలలోనే పర్యాటకులకు అందుబాటులోకి రానున్నట్టు సమాచారం. దీని సందర్శనకు పెద్దలకు రూ.250, పిల్లలకు రూ.100 టికెట్ ధర నిర్ణయించినట్టు తెలుస్తోంది.

యుహెచ్3హెచ్ హెలికాప్టర్

ఇండియన్ నేవీ, విఎంఆర్‌డిఎ సంయుక్త భాగస్వామ్యంతో బీచ్ రోడ్డులో యుహెచ్3హెచ్ హెలికాప్టర్‌ను పర్యాటకుల సందర్శనార్థం ఉంచారు. దీన్ని అమెరికా నుంచి కొనుగోలు చేసిన అనంతరం సీ-కింగ్ అనే పేరుతో నేవీ అధికారులు వినియోగించారు. దాదాపు 17 సంవత్సరాల సేవలు అనంతరం దాని సేవలను గౌరవిస్తూ భవిష్యత్తు తరాలకు స్ఫూర్తినిచ్చేలా విశాఖపట్నం బీచ్ రోడ్డులోని టియు - 142 విమాన మ్యూజియం పక్కన ఏర్పాటు చేశారు. ప్రస్తుతం విఎంఆర్‌డిఎ దీని నిర్వహణ బాధ్యతలు చూస్తోంది. ఈ ఏడాది ఆగస్టు నుంచి ఇది అందుబాటులోకి వచ్చింది.

ఆకర్షిస్తున్న డబుల్ డెక్కర్ బస్సులు

పర్యాటక రంగానికి మరింత శోభ తెచ్చే క్రమంలో గత నెల 29న సిఎం చంద్రబాబు జివిఎంసి ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన డబుల్ డెక్కర్ ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించారు. ఈ బస్సులు ఆర్‌కె బీచ్ నుంచి తొట్ల కొండ వరకు బీచ్ రోడ్డు గుండా మొత్తం 14 పర్యాటక ప్రాంతాలను కవర్ చేస్తూ ప్రయాణిస్తాయి. టికెట్ ధర రూ.250గా నిర్ణయించారు. ఒకసారి టికెట్టు తీసుకుంటే 24 గంటల్లో ఏ స్టాప్‌లోనైనా ఎక్కి ఏ స్టాప్‌లోనైనా దిగొచ్చు. ఈ బస్సుల

మిగతా 2లో..

'సృష్టి' అక్రమాల కేసులో...

ముగ్గురు ప్రభుత్వ వైద్యుల సస్పెన్షన్

వీరిలో ఇద్దరు కెజిహెచ్ డాక్టర్లు



ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా నడుస్తూ సంతాన సాఫల్య సేవల్లో అక్రమాలకు సంబంధించిన 'సృష్టి' కేసులో ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనా సుపత్రులకు చెందిన ముగ్గురు వైద్యులను ప్రభుత్వం సోమవారం సస్పెండ్ చేసింది. ఇందుకు సంబంధించిన సమాచారం కెజిహెచ్, ఆంధ్ర మెడికల్ కాలేజీ అధికారులకు చేరింది. ఈ వ్యవహారంలో ఆంధ్ర మెడికల్ కాలేజీ ఎనస్థిషియా విభాగాధిపతి డాక్టర్ వాసుపల్లి రవి, గైనకాలజీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.ఉషాదేవి, శ్రీకాకుళం ప్రభుత్వ వైద్య కళాశాలలో పిడియాట్రిక్స్ విభాగంలో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.విద్యుల్లతలపై గత నెలలో ఆరోపణలు వచ్చాయి. ఈ ముగ్గురిపై హైదరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ వైద్యులపై నమోదైన కేసుల తీవ్రత దృష్ట్యా పోలీసులు అరెస్ట్ చేసిన తేది నుంచి వారిని సస్పెండ్ చేయాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాలిచ్చారు. వీరిని విధుల్లో కొనసాగిస్తే వ్యవస్థ పట్ల ప్రజా విశ్వాసం సన్నగిల్లుతుందని, కేసుల విచారణకు ఆటంకం కలిగించే అవకాశమున్నందున వారిని సస్పెండ్ చేయాలని మంత్రి ఆదేశించారు.

ఈ ముగ్గురు వైద్యులు 'సృష్టి ' అక్రమాల కేసులో అరెస్ట్ అయినట్లు గత నెల 9న వార్తలొచ్చాయని, వారిపై చర్యలు తీసుకొనటానికి ఆలస్యం ఎందుకైందని మంత్రి ప్రశ్నించారు. పేపరు వార్తల నేపథ్యంలో నిర్ధారణ కోసం సంప్రదించగా, గత నెల 28వ తేదీన అరెస్ట్ తేదీలు, నిందితులు జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న వ్యవధి వివరాలను హైదరాబాద్ పోలీసులు తెలిపారని అధికారులు వివరించారు. 'సృష్టి' అక్రమాలు మీడియాలో వచ్చిన కొద్దిరోజుల ముందు నుంచి ఆ ముగ్గురు వైద్యులు విధుల్లో లేరని, తదనంతరం వారిని సంప్రదించడానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదని మంత్రికి అధికారులు వివరించారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించకుండా ప్రజాభిప్రాయ సేకరణ తగదు

▶ వార్త 8లో..

గరికపాటి రాజారావుకు ఘన నివాళి

▶ వార్త 8లో..

మూగ బాలికపై అత్యాచారం

▶ వార్త మెయిన్‌లో..

సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా

శ్రీనివాసరావు, శంకరరావు


84 మందితో నూతన కమిటీ ఎన్నిక



శ్రీనివాసరావు



శంకరరావు



సత్యనారాయణ

ప్రజాశక్తి -చోడవరం

సిఐటియు అనకాపల్లి జిల్లా 13వ మహాసభలు చోడవరంలో శని, ఆదివారాల్లో ఘనంగా ముగిశాయి. ఈ మహాసభల్లో జిల్లా నూతన కమిటీ 84 మందితో ఏకగ్రీవంగా ఎన్నికైంది. సిఐటియు జిల్లా అధ్యక్షులుగా వివి.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా రుత్తల శంకరరావు, కోశాధికారిగా గనిశెట్టి సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా పిఎన్‌వి పరమేశ్వరరావు, మజ్జి నాగశేషు, వి.సత్యవతి, గూనూరు వరలక్ష్మి, జి.కోటేశ్వరరావు, గంటా శ్రీరామ్, కార్యదర్శులుగా రొంగలి రాము, జి.దేవుడునాయుడు, అడిగర్ల రాజు, ప్రేమ చంద్రశేఖర్, సిహెచ్.రూపాదేవి, మనబాల రాజేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెండు రోజులు పాటు జరిగిన మహాసభల్లో 28 తీర్మానాలను ఆమోదించి భవిష్యత్తులో వాటి సాధనకు పోరాటాలు నిర్వహించాలని మహాసభ నిర్ణయించింది. అనకాపల్లి జిల్లాలో కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొన్న సమస్యలపై అలుపెరుగని పోరాటాలు చేయాలని, గోవాడ సుగర్ ఫ్యాక్టరీ ఆధునీకరణ, బకాయిల

మిగతా 2లో..

మధురవాడలో సీవరేజ్ ప్రాజెక్టు

జివిఎంసి - ఐఎఫ్‌సి ట్రస్ట్ డీడ్ ఒప్పందం



ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి దేశంలోనే మొట్టమొదటి అర్బన్ లోకల్ బాడీగా, అంతర్జాతీయ ఫైనాన్స్ కార్పొరేషన్‌తో నేరుగా రూ.553 కోట్ల ఆర్థిక ఒప్పందం జరిగినట్లు జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్ తెలిపారు. సోమవారం ఉదయం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మున్సిపల్ పరిపాలన - పట్టణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్ సమక్షంలో, జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్, ఐఎఫ్‌సి ఆసియా హెడ్ విక్టోరియా డెల్మాన్ ట్రస్ట్ డీడ్‌పై సంతకాలు చేసినట్లు పేర్కొన్నారు. ఈ ఒప్పందం ద్వారా మధురవాడలో కాలువలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం ఐఎఫ్‌సి రూ.498 కోట్ల పెట్టుబడి అందిస్తుందని తెలిపారు.

ప్రస్తుతం విశాఖ నగరంలో కాలువల నెట్‌వర్క్ కవరేజీ 60 శాతం మాత్రమే ఉండగా, రోజువారీ మలిన జలాల ఉత్పత్తి 225 ఎంఎల్‌డికి గాను శుద్ధి చేయగల ఆపరేటింగ్ సామర్థ్యం కేవలం 110 ఎంఎల్‌డి మాత్రమే ఉదని, రాబోయే రోజుల్లో వేగవంతమైన పట్టణీకరణ కారణంగా 2030 నాటికి ఇది 620 ఎంఎల్‌డికి చేరే అవకాశం ఉందని కమిషనర్ పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా 400 కిలోమీటర్ల కాలువ నెట్‌వర్క్ విస్తరణతో పాటు, పంపింగ్ స్టేషన్లు, లిఫ్ట్ స్టేషన్లు నిర్మించబడతాయని, దీంతో మధురవాడ ప్రాంతంలో కాలువల కవరేజీ ప్రస్తుత 20 శాతం నుంచి 100 శాతం గృహాలకు విస్తరించనుందన్నారు. కొత్తగా 38 ఎంఎల్‌డి శుద్ధి కేంద్రం దశలవారీగా నిర్మించబడుతుందని, 2028 నాటికి 20 ఎంఎల్‌డి సామర్థ్యంతో ప్రారంభమై, 2043 నాటికి పూర్తి సామర్థ్యంతో పనిచేస్తుందని, వివరించారు. దీని వల్ల సుమారు 82,900 గృహాలకు లాభం చేకూరుతుందని పేర్కొన్నారు. ప్రాజెక్టు అమలు వేగవంతంగా జరిగి, విశాఖపట్నంలో సంపూర్ణ కాలువల నెట్‌వర్క్ ఏర్పాటు సమయానికి పూర్తవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించినట్లు కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ కమిషనర్, డైరెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్, ఐఎఫ్‌సి అధికారులు, జివిఎంసి అదనపు కమిషనర్ ఎస్ఎస్.వర్మ పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి..

విశాఖకు పర్యాటక శోభ

కొనుగోలుకు విశాఖపట్నం పోర్టు అథారిటీ రూ.4 కోట్ల సిఎస్ఆర్ నిధులను సమకూర్చింది.

నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు

విశాఖపట్నంలో కైలాసగిరిలో స్కై సైక్లింగ్ ట్రాక్, జిప్ లైనర్లు, నేచర్ కాటేజీలు, బీచ్‌వ్యూకేఫ్, కార్ రేస్, ట్రాక్ థియేటర్ వంటి ప్రాజెక్టులు నిర్మించేందుకు విఎంఆర్‌డిఎ ఇప్పటికే ప్రణాళికలు రచించింది. బీచ్ రోడ్డులో కొత్త మ్యూజియాలు, ఫిట్‌నెస్ జోన్లు, బహిరంగ థియేటర్లు, వాకింగ్, సైక్లింగ్ ట్రాక్‌లు రానున్నాయి. అడ్వెంచర్ టూరిజాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ఆలోచనలు చేస్తున్నారు.

సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా శ్రీనివాసరావు, శంకరరావు

విడుదలకు ఉద్యమించాలని, చోడవరం ప్రాంతంలో కూలిపోయిన బ్రిడ్జిలు, శిథిలమైన రోడ్లు వెంటనే నిర్మాణం చేయాలని, ఉచిత బస్సు పథకంతో ఉపాధి కోల్పోతున్న ఆటో కార్మికులను ఆదుకోవాలని పలు డిమాండ్లతో పోరాటాలను చేయనున్నట్లు నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు వివి.శ్రీనివాసరావు తెలిపారు. మహాసభల జయప్రదానికి సహాయ సహకారాలు అందించిన చోడవరంలోని పెద్దలు, కార్మికులు, ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.



శివశంకర్‌కు వినతిపత్రం అందిస్తున్న కాంట్రాక్టర్లు

సమస్యల పరిష్కారానికి కాంట్రాక్టర్ల వినతి

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: జివిఎంసి కాంట్రాక్టర్ అసోసియేషన్ సభ్యులు తమ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, ఎపి ఎంఎస్ఎంఇ చైర్మన్ డి.శివశంకరరావుకు సోమవారం వినతి పత్రం అందించారు. 2024 ఆగస్టు 1 జివిఎంసి సాధారణ పద్దుల్లో భాగంగా ఇప్పటివరకు రూ.420 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందని దాదాపు 13 నెలలుగా పెండింగ్‌లో ఉన్న బకాయిల్లో కనీసం 6 నెలల బిల్లులు చెల్లింపులు జరిపి కాంట్రాక్టర్లను ఆర్థిక భారం నుండి విముక్తి కల్పించాలని కోరారు. తాము ఇప్పటికే కాంట్రాక్ట్ అసోసియేషన్ కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించి కాంట్రాక్టర్ల ఏకాభిప్రాయాన్ని తెలుసుకుని జివిఎంసికి సమ్మతి తెలిపామని తమ బిల్లులు చెల్లించేందుకు చొరవ చూపేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షులు పివివి నాగరాజు, ప్రధాన కార్యదర్శి ఎం. సంజీవరెడ్డి, సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దమనకాండను ఆపాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : పాలస్తీనాపై ఇజ్రాయిల్ దమనకాండను ఆపాలని డిమాండ్ చేస్తూ సోమవారం డాబా గార్డెన్స్‌లోని బిఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిఇసిహెచ్‌వి సాగర్ మాట్లాడుతూ, 2023 అక్టోబర్ 7 నుండి గాజా, వెస్ట్రన్ బ్యాంక్‌లో ఇజ్రాయిల్ దాదాపు 66 వేలమంది పాలస్తీనియన్లను హతమార్చిందని ఆరోపించారు. గాజా వెస్ట్రన్ బ్యాంక్‌లో ఇజ్రాయిల్ నిర్వహిస్తున్న మారణహోమాన్ని కొనసాగిస్తూ మొత్తం పాలస్తీనా జనాభాను తుడిచిపెట్టడమే లక్ష్యంగా ఉందన్నారు. ఇజ్రాయిల్ మారణహోమాన్ని ఆపాలని ఐక్యరాజ్యసమితి ఆదేశించిందన్నారు. అయినా యునైటెడ్ స్టేట్స్ అందిస్తున్న మద్దతు, ఆధునిక ఆయుధాలతో ఇజ్రాయిల్ ఈ మారణహోమాన్ని కొనసాగిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.రామాంజనేయులు, వి.విశ్వేశ్వరరావు, బుడ్డి దొర, లక్ష్మీనారాయణ, శేషు, కెఎస్ఎన్ రెడ్డి పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులు

తీరుమార్చుకోకపోతే చర్యలు

పిజిఆర్ఎస్‌లో అధికారులపై కలెక్టర్ ఆగ్రహం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ప్రజా సమస్యల పట్ల స్పందించే తీరులో మార్పురాకపోతే కఠిన చర్యలు తప్పవని సోమవారం జరిగిన పిజిఆర్ఎస్‌లో విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను హెచ్చరించారు. గత వారం వచ్చిన ఫిర్యాదులు తీసుకున్న చర్యలను పరిశీలించిన ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలు ఫిర్యాదులు చేస్తుంటే ఉన్నతాధికారులకు అడ్రస్ చేస్తూ ఎండార్స్‌మెంట్ ఇవ్వటమేంటని ప్రశ్నించారు. పోలీసు శాఖ, జివిఎంసి పరిధిలో వస్తున్న ఫిర్యాదులకు నాణ్యమైన పరిష్కారం దొరకటం లేదని నివేదికలు చూస్తే అర్థమవుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణ ప్రణాళికా విభాగంలో నిర్లక్ష్యంగా సమాధానం రాసిన తీరును తప్పుపడుతూ సంబంధిత అధికారులను పిలిపించవల్సిందిగా సహాయ పట్టణ ప్రణాళికాధికారిని ఆదేశించారు. పట్టణ ప్రణాళిక విభాగంలో నిర్లక్ష్యపు తీరు పునరావృతం అయితే సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు.

పిజిఆర్‌కు 315 వినతులు

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)కు ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన 315 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ శాఖకు చెందినవి 119, జివిఎంసికి చెందినవి 85, పోలీస్ శాఖకు సంబంధించినవి 21 ఉండగా వివిధ అంశాలకు, శాఖలకు చెందినవి మరొక 90 ఫిర్యాదులు ఉన్నాయి. జిల్లా కలెక్టర్‌తో పాటు, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, డిఆర్ఒ బిహెచ్.భవానీశంకర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

ఉచిత బస్సు పథకం వల్ల నష్టపోతున్న ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయం చూపాలని డిమాండ్ చేస్తూ విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం (సిఐటియు) ఆధ్వర్యాన జగదాంబ జంక్షన్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఇమామ్, మౌజమ్‌లకు బకాయి ఉన్న 11 నెలల జీతాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ముస్లిం పెద్దలు, వైసిపి నేతలతో కలిపి కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. దువ్వాడ ఎస్ఇజెడ్‌లో ఉన్న సినర్జీస్ యాజమాన్యం ఉద్యోగులకు, ఆపరేటర్లకు, సూపర్‌వైజర్లకు, జెఇలకు 7 నెలల నుండి జీతాలు చెల్లించడం లేదని, బకాయి ఉన్న జీతాలు తక్షణం చెల్లించాలని డిమాండ్ చేస్తూ విఇపిజెడ్ సినర్జీస్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన పిజిఆర్ఎస్‌లో వినతిపత్రం అందించారు. 2010 సంవత్సరం తర్వాత మంజూరు చేసిన సదరం సర్టిఫికెట్ల ప్రాతిపదికన వికలాంగ పర్సెంటేజీ శాతాన్ని యథావిధిగా కొనసాగించి, అర్హులకు పెన్షన్ అందజేయాలని డిమాండ్ చేస్తూ వికలాంగుల హక్కుల పోరాట సమితి (విహెచ్‌పిఎస్) ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఆయా కార్యక్రమాల్లో విశాఖ మోటారు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు బి.జగన్, విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ సిఐటియు జిల్లా కోశాధికారి ఎస్.జ్యోతీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అధ్యయన యాత్రకు సిపిఎం కార్పొరేటర్ దూరం

ప్రజాశక్తి- విశాఖపట్నం : జివిఎంసి నిర్ణయించిన ఉత్తర భారత అధ్యయన యాత్రలో తాను భాగస్వామ్యం కావడం లేదని మేయర్ పీలా శ్రీనివాసరావుకు సిపిఎం 72వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు లేఖ రాశారు. లేఖ వివరాలను మీడియాకు విడుదలచేశారు. ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకు రాజస్తాన్‌లోని జూపూర్, జోధ్‌పూర్, జైసాల్మేర్‌తోపాటు ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌లను అధ్యయన యాత్ర చేపడుతున్నట్లు తెలియజేశారు. ఈ యాత్రలో పాల్గొవాలని తనను కోరారని, దీన్ని తిరస్కరిస్తున్నానని పేర్కొన్నారు. ఈ తరహా అధ్యయన యాత్రల వల్ల జివిఎంసికి, ప్రజలకు ఎలాంటి ప్రయోజనం ఉండదని మొదటి నుంచి తెలియ జేస్తున్నానని పేర్కొన్నారు. 2021లో జివిఎంసి కౌన్సిల్ ఏర్పడిన తరువాత ఇది వరుసగా 4వ అధ్యయన యాత్ర అని తెలిపారు. అధ్యయన యాత్రల పేర ప్రజల సొమ్మును దుర్వినియోగం చేయడంలో కూటమి ప్రభుత్వం, గత వైసిపి మధ్య ఎలాంటి తేడా లేదన్నది స్పష్టం అవుతోందని పేర్కొన్నారు. అధ్యయన యాత్రల రిపోర్ట్ గాని,అధ్యయనం చేసిన అంశాలపై ఇప్పటి వరకు కౌన్సిల్‌లో చర్చకు పెట్టలేదని తెలిపారు. పలుమార్లు కౌన్సిల్ సమావేశంలో చర్చకు పెట్టాలని నిలదీసినా అందుకు తిరస్కరించారని పేర్కొన్నారు.

అధ్యయన యాత్ర నిర్ణయాన్ని పున్ణపరిశీలించి రద్దుచేయాలని విజ్ఞప్తి చేశారు. తక్షణం కౌన్సిల్ సమావేశం ఏర్పాటుచేసి ఆస్తి విలువ ఆధార ఆస్తి పన్ను రద్దు చేస్తూ తీర్మానం చేయాలని, రాష్ట్ర కూటమి ప్రభుత్వం చట్ట విరుద్ధంగా తరలించుకు పోయిన రూ.50 కోట్ల జివిఎంసి వృత్తి పన్ను వెనక్కి ఇచ్చేలా, ప్రతి ఏడాది రాష్ట్ర బడ్జెట్ నుండి జివిఎంసికి కనీసం రూ.2వేల కోట్లు నిధులు ఇచ్చేలా కౌన్సిల్ కోరాలని విజ్ఞప్తి చేశారు.

బ్యాంక్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపక దినోత్సవాలు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: బ్యాంక్ ఆఫ్ ఇండియా విశాఖపట్నం జోన్ వ్యవస్థాపక దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జోన్ మేనేజర్ నికేష్ కుమార్ సిన్హా, డిప్యూటీ జోన్ మేనేజర్ సీతంరాజు హాజరయ్యారు. తమ సంస్థకు చెందిన 82 బ్రాంచిల్లో నిర్వహించిన రుణాల పంపిణీ ద్వారా రూ. 113 కోట్లు రుణాలు అందించామని, విశాఖపట్నంలో తగరపువలస, మారికవలస, విజయనగరం కంటోన్‌మెంట్‌లో మూడు కొత్త బ్రాంచిలు ప్రారంభించామని ఆయన తెలిపారు. శంకర్ ఫౌండేషన్ కు రూ. 10 లక్షల విలువైన వైద్య పరికరాలను విరాళంగా ఇచ్చామని, పలు ఆసుపత్రులకు ఆరు వీల్ చైర్‌లను అందించామని ఆయన తెలిపారు. తమ 12వ వ్యవస్థాపన దినోత్సవాల్లో భాగంగా సూర్యభాగ్ బ్రాంచ్ లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించామని తెలిపారు.

రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: జగదాంబ జంక్షన్ అభివృద్ధి పేరుతో, ఈ ప్రాంతంలో మాజీ ప్రధాని, దివంగత రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని తొలగించారని భద్రపరిచిన ఈ విగ్రహాన్ని జంక్షన్ అభివృద్ధి అనంతరం తిరిగి ఏర్పాటు చేయలేదని, జివిఎంసి అధికారులు స్పందించి విగ్రహాన్ని తిరిగి అదే ప్రాంతంలో ఏర్పాటు చేయాలని నగర కాంగ్రెస్ నాయకులు కోరారు. సోమవారం నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో జివిఎంసి కమిషనర్, అడిషనల్ కమిషనర్‌కి వినతి పత్రం అందించినట్టు పార్టీ దక్షిణ ఇన్‌చార్జి సూర్యనారాయణ మీడియాకు తెలిపారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివకుమార్ పినమాల, సీనియర్ నాయకులు వై.ఎస్‌జగన్, భాషా,ౖ తినాథరావు తదితరులు పాల్గొన్నారు. విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని అధికారులు హామీ ఇచ్చారని తెలిపారు.

10న జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశాలు

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ సిఇఒ పి.నారాయణమూర్తి తెలిపారు. జెడ్‌పి సమావేశ మందిరంలో 1 నుంచి 7 వరకు గల స్థాయీ సంఘ సమావేశాలు వేర్వేరుగా ఉదయం 10 నుంచి 12 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, ఎంపిపిలు, సంబంధిత ప్రగతి నివేదికలతో అధికారులు సమావేశాలకు హాజరుకావాలని కోరారు.

మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్)
మంగళగిరి కోర్టు నందు
O.S.No.54/2018

బిట్వీన్ :
బుడ్డి హరి కిరణ్ మరియు ఇతరులు ..... వాదులు
ఎదురు
బుడ్డి వేంకటేశ్వర రావు మరియు ఇతరులు
..... ప్రతివాదులు

To,
D18. Koppakula Saritha, W/o Satya Narayana, House No.7-44-88/2, Revenue Ward No.4, Sangivalasa, BHEEMILI 531 163, BHEEMILI D.M.C., VISAKHAPATNAM DISTRICT.

యిందుమూలముగా మీకు తెలియుచేయునది ఏమనగా ఈ దావాలోని వాదులు, పై నం. దావాలో మిమ్ములను ప్రతివాదులుగా చూపించి తమ పరిహారము కొరకు మీకు అనేక పర్యాయములు కోర్టు ద్వారా నోటీసులు పంపిన ను మీరు తీసుకొనకపోవుట వలన పై కోర్టు వారు మీకు ఈ పేపర్ ద్వారా తెలియచేయమని ది: 26-09-2025 కు వాయిదా యిచ్చియున్నారు. కావున ఆ రోజున మీరు స్వయముగా కానీ లేదా మీ ప్లీడరు ద్వారా కానీ పై కోర్టులో హాజరై మీ తరపు వాదనలు తెలియచేయవలెను. లేని యెడల మీ పరోక్షమున శ్రీ కోర్టు వారు పై దావాను తీర్మానించగలరు.

శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారము
వాయిదా తేది:26.09.2025

పొట్లూరి శరత్ చంద్ర ప్రసాద్
వాదుల తరుపు న్యాయవాది, మంగళగిరి.

బహిరంగ నోటీసు
మహారాజశ్రీ గౌరవనీయులైన
జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్ నర్సీపట్నం
O.S.No.447/2023

Between
వాకాడ లలిత స్వప్న **...వాది**
And
D4. రాకోటి వెంకట సురేష్ రెడ్డి S/o లేట్ వెంకటరమణ రెడ్డి, R/o డోర్. నెం.2138/1, శారదానగర్, నర్సీపట్నం మున్సిపాలిటీ, అనకాపల్లి జిల్లా.

4వ ప్రతివాది

ఇందుమూలముగా తెలియజేయినది ఏమనగా ఈ ప్రతివాది పై నర్సీపట్నం జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్ లో వాది పంపకం దావా O.S.No. 447/2023 గా దాఖలు చేయడమైనది. అనేక పర్యాయములు కోర్టు వారు నోటీసులు జారీ చేసినా ఈ ప్రతివాది నోటీసు తీసుకోకుండా తప్పించుకుంటున్నారు. అందులకు చివరిగా ఈ దావా వాయిదా **తేదీ 24.09.2025** గా ఇచ్చియున్నారు. ఈ తేదీన **ఉదయం గం. 10.00 లకు,** పైన తెలిసిన కోర్టులో హాజరు కాగలరు. లేని యెడల ఈ ప్రతివాదుల పై Expartee డిక్రీ ఇవ్వబడును.

మాకిరెడ్డి బుల్లి దొర,
సింగంపల్లి రామలక్ష్మి
న్యాయవాదులు, నర్సీపట్నం
అనకాపల్లి జిల్లా

మహారాజశ్రీ యలమంచిలి ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
O.S.No.204/2016

బిట్వీన్
తంపా సత్యన్నారాయణ **...వాది**
మరియు
గొళ్ళ సీతారామ్ వగైరాలు **...ప్రతివాదులు**
టు
D4) గొళ్ళ శ్రీనివాసరావు S/o సీతారమ్
D5) గొళ్ళ వీరబాబు S/o బాబూరావు
D6) గొళ్ళ ప్రసాదు S/o నారాయణరావు
D7) కశిరెడ్డి ఈశ్వరరావు S/o అప్పారావు
D4 to D7 సాకీను సత్యవరం గ్రామము, పాయకరావుపేట మండలం

పైదావా పరిహారం నిమిత్తం మీ మీద పైన వివరించిన వ్యాజ్యము వాది తెప్పించి నందు వల్ల సదరు దావాకు ప్రత్యుత్తరము చెప్పగా అందువలన **2025వ సం॥ 9వ నెల 19వ తారీఖున పగలు 10-30 గంటలకు** స్వతహాగా లేక సరి అయిన భోగట్టా యివ్వబడిన వకీలు ద్వారా లేక సరి అయిన ఏజెంటు మూలముగా ఈ కోర్టులో హాజరు అయ్యేటట్లు యిందు వల్ల మీకు ఆజ్ఞాపించడమైనది మీ ప్రతి వాదమునకు ఆధారముగా ఉద్దేశించి యుండే దస్తావేజులన్నింటిని నీ యొక్క స్టేట్‌మెంట్‌తో సహా ఆ రోజున హాజరుపర్చుటకు మీకు ఉత్తరువు చేయడమైనది పైన చెప్పబడిన దినమందు మీరు హాజరు కాకుండా తప్పిన యెడల మీ పరోక్షమున పై వాజ్యమును విమర్శచేసి తీర్మానించుట అగునని మీరు తెలుసుకోవలసినది.

శ్రీ కోర్టు వారి ఉత్తర్వుతో
వాడపల్లి అన్నపూర్ణయ్య, అడ్వకేటు
యలమంచిలి. సెల్ : 9247157149

మహారాజశ్రీ నర్సీపట్నం సీనియర్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
E P 13/2022 OS 78/2013

పిటిషనరు/DHR పోతురాజు అమ్మాజి
రెస్పాండెంటు/JDR కంభం ఇష్మాయెలు జయరాజు
To:
JDR : కంభం ఇష్మాయెల్ జయరాజు
S/o లేటు సామ్యేలు 60సం, వైద్యాధికారి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లంకవానిపాలెం, కె.కోటపాడు మండలం, అనకాపల్లి జిల్లా.

రూలు 22 నోటీసు

పిటిషనరుకు రెస్పాండెంటు అయిన మీ వల్ల రావలసిన ప్రాంసరీ నోటు బాకీ రాబట్టుకునే నిమిత్తం మీ పై దావా వేసి దావాతో పాటు రెస్పాండెంటు/JDR అయిన కంభం ఇష్మాయెల్ జయరాజు తండ్రి లేటు సామ్యేలు తాలూకు Encashment of Leave Salary Amount ను IA 451/2013 నెంబరు జప్తు పిటిషనులో జప్తు చేయించమని కోరుచూ దాఖలు చేసి జప్తు పిటిషనులో Encashment of Leave Salary Amount ను IA 451/2013 కోర్టు ద్వారా జప్తు అయినది, జప్తు కాబడిన సొమ్మును కోర్టుకు Send for చేయించమని అమలు దాఖలు చేసి నందున JDR/రెస్పాండెంటుకు రూలు 22 నోటీసు ఆర్డరు చేయగా కోర్టు నుండి రూలు 22 నోటీసు పంపిచునప్పటికి మీరు నోటీసు అందుకొనక తప్పించుకున్నందున సబ్‌ట్యూటెడ్ సర్వీసు ద్వారా రూలు 22 నోటీసు కోర్టు వారు ఆర్డరు చేసియున్నారు. సదరు కేసులో మీ హాజరు నిమిత్తం **తే.08-10-2025దీకి** వాయిదా వేసియున్నారు. కావున ఆ దినమున మీరు స్వయంగా గాని ప్లీడరు/వకీలు ద్వారా గాని **ఉదయం 10:30 గం॥లకు** సదరు కోర్టులో మీరు హాజరు కావలెను అట్ల హాజరు కాని యెడల శ్రీ కోర్టువారు చట్ట ప్రకారం మీ పరోక్షముగా తీర్మానించెదరని ఇందు మూలంగా తెలియజేయడమైనది.

జి.ఎ.మంగ
నర్సీపట్నం **అడ్వకేటు, నర్సీపట్నం**
తేది.8-9-2025 **సెల్ : 9603369343**

ఆర్‌టిసి బస్సు సదుపాయం కల్పించాలి

ప్రజాశక్తి-తగరపువలస : భీమిలి నుంచి తగరపువలస మీదుగా విజయనగరం, పద్మనాభం, ఆనందపురం తది తర ప్రాంతాలతో పాటు అటు శ్రీకాకుళం, శ్రీకూర్మం, ఎస్ కోట, కోట గంట్రేడు, మాడుగుల, పోరాం, పాలకొండ, తుని ప్రాంతాలకు ఆర్‌టిసి బస్సు సర్వీసులు నడపాలని చిట్టి వలస ప్రాంతానికి చెందిన బల్ల వెంకటరావు కోరారు. సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. గతంలో ఆయా ప్రాంతాలకు భీమిలి నుంచి ప్రయివేటు బస్సు సర్వీసులు నడిచేవన్నారు. పర్యాటకంగా భీమిలి అభివృద్ధి చెందడంతోపాటు భోగాపురం విమానాశ్రయం త్వరలో అందుబాటులోకి రానున్న నేపథ్యంగా ఆయా ప్రాంతాలకు కనెక్టవిటీగా ఆర్‌టిసి బస్సులు నడపాలని, భీమిలిలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ వినియోగంలోకి తేవడంతోపాటు, తగరపువలసలో ఆర్‌టిసి కాంప్లెక్స్ నిర్మించాలని కలెక్టర్‌ను వినతిపత్రంలో కోరారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి -పద్మనాభం: మండలంలో కృష్ణాపురం గ్రామంలోని స్ప్రింగ్ ఫీల్డ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ బస్సుకు భారీ ప్రమాదం త్రుటిలో తప్పింది. సోమవారం ఉదయం తాటితూరు నుంచి 40మంది విద్యార్థులను ఎక్కించుకుని పాఠశాలకు వస్తుండగా, పాండ్రంగి జంక్షన్ సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి, స్టీరింగ్ అదుపుతప్పడంతో ప్రమాదానికి గురైనట్లు పాఠశాల నిర్వాహకులు వెల్లడించారు. ప్రమాదస్థలంలో ఎదురుగా వస్తున్న ఆటో రోడ్డులోని గోతులను తప్పించబోయి, బస్సు డ్రైవర్ దాన్ని తప్పించబోయి, చాకచక్యంగా తాటిచెట్లు, ముళ్లపొదల వైపు మళ్లించడంతో పెద్ద ప్రమాదం త్రుటిలో తప్పింది. అక్కడే ఉన్న హైటెన్షన్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొంటే భారీ నష్టమే జరిగి ఉండేదని భావిస్తున్నారు. ప్రమాదంలో బస్సులో ఉన్న 40మంది చిన్నారుల్లో ముగ్గురికి స్వల్పగాయాలు కావడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. సమాచారం తెలిసిన వెంటనే పాఠశాల నిర్వాహకులు ఆలివర్ రాయ్ సంఘటనాస్థలికి చేరుకుని గాయపడిన విద్యార్థులను వైద్యసేవలకు తరలించారు. ప్రమాదంపై బస్ డ్రైవర్ ఎన్.పైడితల్లితోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

• భీమిలి మండల సర్వసభ్య సమావేశంలో ఎంపిపి వాసురాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి వాసురాజు

ప్రజాశక్తి భీమునిపట్నం : జివిఎంసిలో గ్రామ పంచాయతీల విలీనం ప్రతిపాదన ఉన్నందున, నిర్ణీత గడువులోగా గ్రామాల్లో అభివృద్ధి పనులను ప్రాధాన్యతా క్రమంలో వేగవంతం చేయాలని ఎంపిపి దంతులూరి వెంకటశివ సూర్యనారాయణ రాజు (వాసురాజు) సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం ఎంపిపి అధ్యక్షతన మండల పరిషత్ సాదారణ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతూ, గ్రామాల్లో తాగునీటి సమస్యను తొలి ప్రాధాన్యతగా, తర్వాత రోడ్లు, ఇతర అభివృద్ధి పనులకు నిధులు ఖర్చు చేయాలన్నారు. లోపభూయిష్టమైన రీసర్వేతో గ్రామాల్లో భూవివాదాలకు ఆస్కారమేర్పడిందని, రెవెన్యూ సమస్యలు ఎక్కువగా, జఠిలంగా ఉన్నాయన్నారు. సర్వే నంబర్ల స్థానే భూములకు ఎల్‌పిఎం నంబర్లుగా మార్చడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై డిటి ప్రసాదరావు బదులిస్తూ ఈ సమస్య తమ పరిధిలో లేదని, జాయింట్ కలెక్టర్, రెవెన్యూ చీఫ్ సెక్రటరీ పరిధిలో ఉందన్నారు. 2022 నుంచి 2025 జనవరి వరకు మండలంలో 12 గ్రామ సచివాలయాల పరిధిలో దాదాపు రూ.8 కోట్ల సర్‌చార్జీలు రావాల్సి ఉందని, దీనిపై స్థానిక ఎమ్మెల్యే గంటాతోపాటు జిల్లా కలెక్టర్‌ను బుధవారం ఎంపిటిసిలు, సర్పంచ్‌లు బృందంగా వెళ్లి కలిసి విన్నవించాలని నిర్ణయించారు. సమావేశంలో జెడ్‌పిటిసి గాడు వెంకటప్పడు, వైస్ ఎంపిపి బోని బంగారునాయుడు, డిఎల్‌డిఒ నిర్మలా దేవి, ఎంపిడిఒ

సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

• యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు జగ్గునాయుడు పిలువు



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు జగ్గునాయుడు

ప్రజాశక్తి- తగరపువలస : నవ్యాంధ్ర లో తొలిసారిగా విశాఖ నగరంలో ఈ ఏడాది డిసెంబర్ 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు జరుగనున్న సిఐటియు అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని ఆ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు ఎం జగ్గునాయుడు కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. సోమవారం సిఐటియు భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యంలో చిట్టివలస జ్యూట్ మిల్ కల్యాణ మండపంలో వివిధరంగాల కార్మికులతో విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతూ, మహాసభలకు దేశం నలుమూలల నుంచి కార్మిక నేతలు హాజరు కానున్నారని, సదస్సులు, సెమినార్లు, చర్చా గోష్ఠి లాంటి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. వచ్చే జనవరి 4న నగరంలో భారీర్యాలీ, బహిరంగ సభ ఉంటుందని, వీటన్నింటినీ జయప్రదం చేయాలని కోరారు.

94 శాతంగా ఉన్న అసంఘటిత కార్మికులకు ఇఎస్ఐ, పిఎఫ్ లాంటి సదుపాయాలు, వారి హక్కుల కోసం సమగ్ర చట్ట సాధనకు మహాసభల్లో ఉద్యమ కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం 4 లేబర్ కోడ్స్‌తో కార్మికులను యజమానులకు బానిసలుగా చేయడానికి చూస్తోందని, వీటిఅమలుకు గత వైసిపి ప్రభుత్వం ముందుకు రాగా, కార్మిక వర్గం జరిపిన పోరాటాలకు వెనక్కి తగ్గిందన్నారు. కానీ కూటమి ప్రభుత్వం వీటి అమలుకు ముందుకొచ్చిందని, ఇందులో భాగంగానే 8 గంటల పనిదినాన్ని 10 గంటలకు పెంచుతూ క్యాబినెట్ నిర్ణయం చేసిందన్నారు. ఏడాది కాలంలోనే కూటమి ప్రభుత్వం కార్మిక వర్గంపై దాడి ఎక్కు పెట్టిందన్నారు. స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ 26 వేలు చెల్లింపు, వారికి ఉద్యోగ భద్రత, సంక్షేమ పథకాలు అమలుకు పోరాటాలు చేయాల్సిఉందన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఎలక్ట్రీషియన్లుగా, ప్లంబర్లుగా, భవన నిర్మాణ కార్మికులుగా పని చేస్తున్న వారికి ప్రత్యేక హక్కులు, చట్టాల సాధనకు పోరాటానికి సిద్ధం కావాలన్నారు. సిఐటియు భీమిలి జోన్ అధ్యక్ష కార్యదర్శులు ఆర్‌ఎస్‌ఎన్ మూర్తి, ఎస్ అప్పలనాయుడు, ఆటో, ముఠా, ఆశా, అంగన్వాడీ, తోపుడు బళ్ల కార్మికులు పాల్గొన్నారు.

రజకులను హత్య చేసిన నిందితులను శిక్షించాలి

ప్రజాశక్తి- మాధవధార : శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస మండలం కొత్తవలస గ్రామంలో రజకులపై దాడి, హత్యాకాండలో బాధ్యులను శిక్షించాలని ఎపి రజక వృత్తిదారుల సంఘం విశాఖ జిల్లా కమిటీ అధ్యక్షులు పట్నాల వెంకటరమణ, కార్యదర్శి మల్లేశ్వరపు ఈశ్వరరావు డిమాండ్ చేశారు. రజకులపై దాడిని ఖండిసూత, బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. వినాయక ఉత్సవాల సందర్భంగా రజకులపై దాడి చేసి హత్య చేయడం దుర్మార్గమన్నారు. మరణించిన రజక మహిళ అరసవల్లి హారమ్మ కుటుంబానికి రూ. 50 లక్షలు, క్షతగాత్రులకు రూ.పదిలక్షలు చొప్పున ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి మెరుగైన వైద్యం అందించాలన్నారు, ఇటీవల బాధితులను విశాఖలో కలిసి పరామర్శించామన్నారు. కార్యక్రమంలో జె. చిన్న, కె.పైడిశెట్టి, కె.అప్పలరాజు కె.సతీష్‌కుమార్ ఎ. సతీష్, ఎం.తాతారావు, టి. అప్పారావు పాల్గొన్నారు,

నేరాలు ఘోరాలు

ఉరేసుకుని బాలిక ఆత్మహత్య

ప్రజాశక్తి- ఆనందపురం: : మండలం వెల్లంకి పంచాయతీ బొడ్డపాలెం గ్రామంలో బాలిక ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన చోటుచేసుకుంది. ఒడిశా రాయగడ తలకాడ ప్రాంతానికి చెందిన మెట్ట నిషిత (14) రెండు నెలల క్రితం పనుల నిమిత్తం బొడ్డపాలెం గ్రామానికి వచ్చింది. ఎవర్‌గ్రీన్ ప్లైవుడ్ కంపెనీలో పని చేయాలనుకున్నా, మైనర్ కావడంతో యాజమాన్యం నిరాకరించడంతో, ఆమె స్థానికంగా అద్దెంట్లో నివాసముంటోంది. సోమవారం ఉదయం నిషిత గది నుంచి బయటకు రాకపోవడంతో ఇంటి యజమానులు అనుమానంతో తలుపులు కొట్టారు. స్పందన రాకపోవడంతో బలవంతంగా తలుపు తెరిచి చూడగా, నిషిత సీలింగ్ ఫ్యాన్‌కు చున్నితో ఉరేసుకొని ప్రాణాలు తీసుకున్నట్టు గుర్తించారు. అందిన సమాచారం మేరకు సీఐ వాసునాయుడు, ఎస్ఐ శివ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని భీమిలి ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. మృతురాలి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కేసు దర్యాప్తు ప్రారంభించారు. మృతికి కారణాలు తెలియరాలేదు.

ఆటోలో వ్యక్తి మృత్యువాత

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : లీలామహల్ జంక్షన్‌లో ఒక వ్యక్తి ఆటోలో అనుమానాస్పదంగా మృతిచెందాడు. టూ టౌన్ పోలీసుల కథనం ప్రకారం... సోమవారం ఉదయం 7.15 గంటలకు టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు 112 కాల్ ద్వారా లీలామల్ జంక్షన్లో ఆటో నెంబర్ ఎపి39 డబ్ల్యు డి 1192లో ఒక వ్యక్తి అనుమానాస్పదంగా మృతిచెంది ఉన్నాడని సమాచారం వచ్చింది. కానిస్టేబుల్ రవి కిరణ్ వెళ్లి పరిశీలించారు. మృతుడు నీలమ్మ వేప చెట్టు ప్రాంతానికి చెందిన బొంత అప్పలరాజు (55)గా గుర్తించారు. మృతుని కుటుంబానికి సమాచారం అందించడంతో కుమారుడు భరత్ సంఘటన ప్రాంతానికి వచ్చారు. ఆయన సమక్షంలో మృతదేహాన్ని కెజిహెచ్ మార్చురీకి తరలించారు. మృతుని భార్య ఉమ భర్త మరణంపై అనుమానం వ్యక్తం చేయటంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాలుడు అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎంవిపి పోలీస్ స్టేషన్ పరిధిలో ఏడేళ్ల బాలుడు అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... ఈ నెల 7వ తేదీన ఎంవిపి పోలీస్ స్టేషన్ పరిధిలోని వాసవానిపాలెంలో చొక్కా పెద్దిమ కుమారులు యశ్వంత్, ధనుష్ రాత్రి రొయ్యల కూరతో భోజనం చేసి పడుకున్నారు. రాత్రి 11.30 సమయంలో పిల్లలిద్దరూ వాంతులు చేసుకోవడం ప్రారంభించారు. వెంటనే వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో యశ్వంత్‌ను రాత్రి 2 గంటల సమయంలో కెజిహెచ్ తరలించారు. చికిత్స పొందుతూ యశ్వంత్ (7) సోమవారం 10.30 గంటలకు మరణించాడు. సంఘటనపై తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ విచారణ చేపట్టారు.

చోరీ కేసులో నిందితునికి ఏడాది జైలు

- భారతీయ న్యాయ సంహిత చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత తొలి తీర్పు

ప్రజాశక్తి-విశాఖ లీగల్ : తాళాలు వేసిన ఇంట్లో ప్రవేశించి దొంగతనానికి పాల్పడిన నిందితునికి ఏడాది కఠిన జైలుశిక్ష విధిస్తూ నగరంలోని ప్రధాన జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఎం ప్రదీప్‌కుమార్ సోమవారం తీర్పునిచ్చారు. జైలు శిక్షతోపాటు రూ.ఆరువేల జరిమానా విధించారని, చెల్లించని పక్షంలో అదనంగా నెల రోజులు సాధారణ జైలుశిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తీర్పులో స్పష్టం చేశారు. సీనియర్ ప్రత్యేక అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మైలపల్లి ఆదినారాయణ అందించిన వివరాలివి. విశాఖలోని మల్కాపురం ప్రాంతానికి చెందిన నిందితుడు పొట్టి కృష్ణ, ఈ ఏడాది ఫిబ్రవరి 14న పాత డెయిరీ ఫారం వద్ద చెక్క మురళీకృష్ణ అనే వ్యక్తి కుటుంబంతో సహా హైదరాబాద్ వెళ్లిన సమయంలో తాళాలు వేసి ఉన్న ఇంట్లో 22 తులాల బంగారం, కిలో వెండి, రూ. లక్ష నగదు చోరీకి పాల్పడ్డాడు. బాధితుల నుంచి అందిన ఫిర్యాదుతో దర్యాప్తు చేసిన ఆరిలోవ పోలీసులు, నిందితునిపై భారతీయ న్యాయ సహింత (బిఎన్ఎస్) సెక్షన్ 317(2) కింద నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. విచారించిన న్యాయమూర్తి, నిందితునిపై నేరం రుజువు కావడంతో ఈ విధంగా తీర్పు చెప్పారు. భారతీయ న్యాయ సంహిత చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత తొలి తీర్పుగా భావిస్తున్నారు.

ముగిసిన నేత్రదాన పక్షోత్సవాలు

ప్రజాశక్తి- సీతమ్మధార : ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, మొహిసిన్ ఐ బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిననేత్ర దాన అవగాహన పక్షోత్సవాలు సోమవారం ఘనంగా ముగిసాయి. లను ఘనంగా ముగించారు. ముగింపు కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వర రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్ , జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ వీ మీనాక్షి ఆధ్వర్యంలో విద్యార్థులకు నేత్రదానంపై అవగాహన, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రజల రద్దీగా ఉండే ఆర్‌టిసి కాంప్లెక్స్, రైల్వే స్టేషన్ మొదలగు ప్రదేశాలలో పదివేల కరపత్రాల పంపిణీ, వ్యక్తిగతంగా ఐదు వేలమందిని కలిసి అగాహన కల్పింఆచరు. బీచ్‌రోడ్డులో నేత్రదానంపై అవగాహనా ర్యాలీ నిర్వహణతోపాటు కొందరితో నేత్రదానానికి అంగీకరిస్తూ పత్రాలను తీసుకున్నారు. నేత్రదాతల కుటుంబీలకు జ్ఞాపికలను జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్ ద్వారా అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ జ్యోతిర్మయి,డాక్టర్ నవీన్ కుమార్, డాక్టర్ శ్రీలక్ష్మి, ఐ బ్యాంకు మేనేజర్ అభినీత్ ,ఆప్తాల్మిక్ ఆఫీసర్లు ఉమా శ్రీనివాస్, ఆర్ సురేష్ ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్య శాల సిబ్బంది, ఆంధ్ర మెడికల్ కళాశాల విద్యార్థులు, ఎల్ వి ప్రసాద్ ఐ హాస్పిటల్, మొహిసిన్ ఐ బ్యాంక్ ప్రతినిధులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు

పట్టాల రిజిస్ట్రేషన్‌లో ఆందోళన చెందొద్దు

ప్రజాశక్తి- ములగాడ : జిఒ 296 ప్రకారం ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్‌లో లబ్ధిదారులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్థానిక తహశీల్దార్ స్పష్టం చేశారు. ఇంటిస్థలాల ఒరిజినల్ పట్టాలు తీసుకుని, ఎటువంటి రశీదు ఇవ్వకపోవడంతో లబ్ధిదారుల్లో నెలకొన్న సందేహాలు, ఆందోళనపై సోమవారం జివిఎంసి 59వ వార్డు వైసిపి అధ్యక్షుడు రేవళ్ళ సత్యనారాయణ ఆధ్వర్యంలో తహశీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై తహశీల్దార్ స్పందిస్తూ, పేరుపేరునా లబ్ధిదారులకు రశీదు ఇవ్వలేమని, స్థలాల రిజిస్ట్రేషన్ చేసి, పట్టాతోపాటు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌ను ఒక ఫైల్‌లో పెట్టి పట్టా ఇస్తామన్నారు. స్థలాల రిజిస్ట్రేషన్‌లో ఎటువంటి అవకతవకలకు ఆస్కారం లేదని, ఎవరికీ ఎటువంటి ముడుపులు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. దళారులను ఆశ్రయించవద్దని సూచించారు. వినతిపత్రంపై తహశీల్దార్ సంతకం చేయించి, జిరాక్స్ ప్రతిని అడిగి తీసుకున్నారు. వార్డు వైసిపి ఉపాధ్యక్షుడు ఎదురు సత్యనారాయణ, వెస్ట్ సోషల్ మీడియా ఇంచార్జి సంపత్ కుమార్, ట్రేడ్ యూనియన్ నాయకుడు భూపతినాయుడు, నాయకులు ఖాన్, అర్జున్, ఎడ్ల సత్యనారాయణ బుల్లబ్బాయి పాల్గొన్నారు.

రహదారి సమస్య పరిష్కారానికి వినతి

ప్రజాశక్తి-మధురవాడ :దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న జివిఎంసి ఐదోవార్డు స్వయంకృషి నగర్ రహదారి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరారు. సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో జివిఎంసి రెండో జోనల్ కార్యాలయంలో జెడ్‌సి కనకమహాలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రహదారి స్థలాన్ని ఆరు వందల గజాలకు పైగా ఆక్రమించారన్నారు. కేవలం 10 అడుగుల వెడల్పు స్థలాన్ని రహదారికి కేటాయిస్తే సరిపోతుందని, దీనికి తహశీల్దార్ కార్యాలయం నుంచి క్లియరెన్స్ కోరుతున్నా అదికూడా చేయలేకపోతున్నారని ఆరోపించారు. దీనిపై అనేకసార్లు అర్జీలు పెట్టినా స్పందించడం లేదని, సరికదా ప్లానింగ్ సెక్రటరీలు ఆక్రమణదారునికి అనుకూలంగా నివేదిక ఇచ్చి ముగిస్తున్నారన్నారు. దీనిపై జెడ్‌సి స్పందిస్తూ, తహశీల్దార్ కార్యాలయానికి క్లియరెన్స్ కోసం లెటర్ పెట్టాలని టిపిఒను ఆదేశించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సిపిఎం నేతలు డి.అప్పలరాజు,కె.మణి, టికె.శారద ఉన్నారు.

తీరంలో కాంక్రీట్ గట్టు నిర్మించాలి

ప్రజాశక్తి-భీమునిపట్నం : స్థానిక బీచ్ రోడ్డు లైట్‌హౌస్ నుంచి ఉప్పుటేరు వరకు సుమారు 800 మీటర్ల పొడవునా 4 మీటర్ల లోతులో కాంక్రీట్ లేదా కొండరాళ్ళతో గట్టు నిర్మించాలని కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ మత్స్యకార కమిటీ చైర్మన్ పి రజనీకాంత్ కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్‌ను కలిఇస వినతిపత్రం అందజేశారు. సముద్రంలో చేపల వేటకు వెళ్లేటప్పుడు ఫైబర్ పడవలు దించే సమయంలో ఒడ్డుకు చేర్చే సమయంలో కెరటాల తాకిడికి మత్స్యకారులు అనారోగ్యానికి గురవుతున్నారని, పడవలు మునిగి ఆస్తి, ప్రాణ నష్టం జరిగే సందర్భాలు ఉన్నాయన్నారు .జివిఎంసి మూడో వార్డు అధ్యక్షులు పి రామారావు ఉన్నారు

11న బహిరంగ సభ జయప్రదం చేయండి

- ఉక్కు పరిరక్షణపై టిడిపి నేతల మోసపూరిత ప్రకటనలు మానుకోవాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జగ్గునాయుడు, సిపిఎం నేతలు

ప్రజాశక్తి -గాజువాక : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదంటూ స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ శ్రీభరత్ నేటికీ స్పష్టతలేని ప్రకటనలతో ప్రజలను మోసం చేస్తున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు మండిపడ్డారు. సోమవారం గాజువాక సిపిఎం కార్యాలయంలో ఈనెల 11న సాయంత్రం ఐదు గంటలకు పాత గాజువాకలో నిర్వహించే బహిరంగ సభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ జరిగితే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని చెబుతూ, బయటకు మాత్రం స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ జరగదని తప్పుడు ప్రకటనలు చేయడం దుర్మార్గమన్నారు. పార్లమెంట్‌లో ఎంపీలు అడిగిన ప్రశ్నలకు విశాఖ స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణ ఆగదని కేంద్ర ప్రభుత్వం చెబుతుంటే, ఇక్కడ మసిపూసి మారేడుకాయ చేసే ప్రకటనలు చేయడం దుర్మార్గమన్నారు. ప్యాకేజీ తెచ్చామని గొప్పలు చెబుతున్నా, అది జిఎస్‌టికి, విఆర్‌ఎస్ కార్మికుల చెల్లింపులకే సరిపోలేదన్నారు. తొలగించిన ఐదు వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలన్నారు. సమస్యలపై ఈనెల 11న జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఎం నాయకులు ఎన్ రామారావు మాట్లాడుతూ, కూటమిని గెలిపిస్తే, స్టీల్ ప్లాంట్ పరిరక్షిస్తామనిఎన్నికలకు ముందు హామీనిచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఉక్కు పరిరక్షణకు పోరాడుతున్న కార్మికుల దీక్షా శిబిరాన్ని తొలగించారంటే పరిరక్షణపై ఎంత చిత్తశుద్ధి ఉందో స్పష్టమౌతోందన్నారు. సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం రాంబాబు మాట్లాడుతూ, తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలన్నారు పోస్టర్ ఆవిష్కరణలో సిపిఎం నాయకులు ఎ.లోకేష్ జి అప్పారావు పాల్గొన్నారు.

ఇఒఐ పేరుతో స్టీల్‌ప్లాంట్ అమ్మకం ఆపాలి

ఉక్కునగరం : ఇఒఐ పేరుతో స్టీల్ ప్లాంట్ అమ్మకం ఆపాలని స్టీల్ సిఐటియు గౌరవ అధ్యక్షులు జె అయోధ్యరామ్ డిమాండ్ చేశారు. సోమవారం స్టీల్ సిఐటియు ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ కొవ్వొత్తుల జంక్షన్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 11న జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జె అయోధ్యరామ్ మాట్లాడుతూ, స్టీల్ కార్మికులకు జీతాలను చెల్లించకుండా కేంద్ర ప్రభుత్వం, స్టీల్ యాజమాన్యం అనైతికంగా, దుర్మార్గంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఎనిమిదో తేదీ దాటినా ఈ నెల జీతాలు ఇంకా చెల్లించలేదని, మరోపక్క మంత్రి అసత్యాలను వల్లే వేస్తున్నారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా బకాయిపడిన వేతనాన్ని, వేతనాలను సకాలంలో యాజమాన్యం చెల్లించాలని డిమాండ్ చేశారు. స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు రామస్వామి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ లేదని మీడియాతో చెబుతున్న నేతలు, పార్లమెంట్లో సంబంధిత మంత్రి ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోలేదని చెప్పడం ఏమిటని ప్రశ్నించారు స్టీల్‌ప్లాంట్‌లో ఇఒఐ పేరుతో యాజమాన్యం ఆహ్వానించిన టెండర్లను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్టీల్ సిపిఎం కార్యదర్శి పి శ్రీనివాసరాజు మాట్లాడుతూ ఇప్పటికే ఇఒఐకి వ్యతిరేకంగా పాదయాత్రలు, బహిరంగ సభలు నిర్వహించి ప్రజలను చైతన్యపరిచామన్నారు. ఈనెల 11న గాజువాకలో సిపిఎం బహిరంగ సభ జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి దాస్, స్టీల్ సిఐటియు నాయకులు పుల్లారావు, శ్రీనివాసరెడ్డి, రామ్ శేఖర్, శ్రీనివాస్, సూర్యనారాయణ, బి ఎన్ మధుసూదన్, కార్మికులు పాల్గొన్నారు.



ప్రచారయాత్రలో మాట్లాడుతున్న అయోధ్యరాం

'గీతం'లో తెలుగు టైటాన్స్ సందడి

ప్రజాశక్తి-మధురవాడ : ప్రో కబడ్డీ లీగ్ 12వ సీజన్ సందర్భంగా గీతం యూనివర్సిటీలో కబడ్డీ ఆటగాళ్ల సందడి నెలకొంది. పికెఎల్ నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా ౕ పికెఎల్ టెక్నికల్ డైరెక్టర్ ఇ.ప్రసాదరావు, గీతం అసిస్టెంట్ డీన్ అరుణ్ కార్తీక్ ఆధ్వర్యంలో తెలుగు టైటాన్స్ ఆటగాళ్లను విద్యార్థులు, అభిమానులు కలుసుకున్నారు. ఈ సందర్భంగా పికెఎల్ టెక్నికల్ డైరెక్టర్ మాట్లాడుతూ, కబడ్డీ ఆట అభివృద్ధి, యూనివర్సిటీ స్థాయిలో క్రీడల ప్రాముఖ్యత, యువ క్రీడాకారులను ప్రోత్సహించడంలో పికెఎల్ పాత్ర వివరించారు. కబడ్డీ కేవలం ఆట మాత్రమే కాదని, ఇది మన సంస్కృ, అస్థిత్వానికి నిదర్శనమన్నారు.

చిన్న పల్లెటూరి ఆటగా మొదలైన కబడ్డీ, నేడు పికెఎల్ కారణంగా ప్రపంచ వేదికపై ఒక గొప్ప క్రీడగా మారింది. బీచ్‌ల నుంచి ఇండోర్ అరేనాలకు, ఆసియా గేమ్స్ నుంచి ప్రపంచ వేదికకు ఈ ఆట పూర్తిస్థాయిలో రూపాంతరం చెందిందన్నారు. కబడ్డీలో తొలి ఒలింపిక్ స్వర్ణ పతకాన్ని భారత్ సాధించే రోజు ఎంతో దూరంలో లేదన్నారు. కోటీశ్వరులు కావాలంటే, ప్రో కబడ్డీ లీగ్‌లో చేరాలని సరదాగా వ్యాఖ్యానించారు.అనంతరం తెలుగు టైటాన్స్ ఆటగాళ్లతో విద్యార్థులు, యూనివర్సిటీ కబడ్డీ క్లబ్ సభ్యులు నేరుగా ముఖాముఖి నిర్వహించారు. వృత్తిపరమైన క్రీడాకారుల జీవితం గురించి విద్యార్థులు ఎన్నో ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు.

తెలుగు టైటాన్స్ కెప్టెన్ విజయ్ మాలిక్ మాట్లాడుతూ, చిన్న గ్రామం నుంచి వచ్చిన తన జీవితాన్ని కబడ్డీ ఎఆట మార్చేసిందన్నారు.కబడ్డీ తమ కుటుంబాలకు అండగా నిలబడే శక్తినిచ్చిందన్నారు. ఆటగాళ్లతో సరదా ఆటలు, క్విజ్ సెషన్స్ నిర్వహించారు.

పెండింగ్ సమస్యల పరిష్కారానికి ధర్నా



ధర్నాలో మాట్లాడుతున్న సిఐటియు నేత అప్పారావు

ప్రజాశక్తి- కలెక్టరేట్ : పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జివిఎంసి అవుట్ సోర్సింగ్ కార్మికులు సోమవారం జ్ఞానాపురంలోని ఐదో జోనల్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జోన్ సెక్రటరీ ఒమ్మి అప్పారావు మాట్లాడుతూ, కొన్నేళ్లుగా కార్మికుల పెండింగ్ జీతాలు చెల్లించడం లేదన్నారు. ప్రతినెలలోనూ వార్డులో వార్డులో ఒకరికో ఇద్దరికో జీతాలు మిస్ అయిపోతున్నాయని, వాటి చెల్లింపులో చర్యలు చేపట్టడం లేదన్నారు 57వ వార్డులో ఒకేసారి తొమ్మిది మందికి జీతాలు పడలేదన్నారు. గత ప్రభుత్వ హయాంలోనే జరిగే లోపాలే, ప్రస్తుత ప్రభుత్వంలోనూ కొనసాగడంతో కాఇర్మకులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. దీనికితోడు మున్సిపల్ పారిశుధ్య కార్మికులను ప్రయివేటుపరం చేసి, కాంట్రాక్టర్లకు అప్పగించాలని చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. దీన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ జరగబోనివ్వమని స్పష్టం చేశారు.

రిటైర్డ్, డెత్, సిక్ పోస్టులను ఆప్కాస్ ద్వారా కార్మికుల పిల్లలకు తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2022 నుంచి నేటివరకు జోన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న కార్మికుల వేతనాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. 2021లో కొందరు కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఆక్యుపేసనల్ హెల్త్ అలవెన్స్ మంజూరు చేయాలని డిమాండ్ చేసారు. సమస్యలపై స్పందించకుంటే జోనల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. జెడ్‌సిని కలసి, సమస్యల పరిష్కారంపై నిలదీసిన తర్వాత వినతిపత్రం అందజేశారు. దీనిపై జెడ్‌సి స్పందిస్తూ ఎవరెవరికి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయో బుధవారం వివరాలతో రావాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ సిఐటియు జోన్ నాయకులు ఎస్ శ్రావణ్‌కుమార్, వి మహేశ్వరి, ఎ కంతల్లి, కె బాలరాజు, ఎస్ పాపారావు, రమణమ్మ, ధనలక్ష్మి పాల్గొన్నారు

పిజిఆర్‌ఎస్‌లో వినతుల స్వీకరణ

ప్రజాశక్తి- విశాఖపట్నం : జివిఎంసి ఐదో జోనల్ కార్యాలయంలో సోమవారం జెడ్‌సి బి. రాము ప్రజా పరిష్కార సమస్యల వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. రెవెన్యూ, టౌన్ ప్లానింగ్‌కు సంబంధించి చెరో అర్జీ రాగా, వాటి పరిష్కారానికి సంబంధిత విభాగాలకు రిఫర్ చేశారు. పిజిఆర్‌ఎస్‌లో ఇఇ పద్మావతి, తారా ప్రసన్న ,రెవిన్యూ ఆఫీసర్ బాబూరావు, రాజ్యలక్ష్మి, టౌన్ ప్లానింగ్ ఎసిపి తిరుపతిరావు,వాటర్ సప్లై, యూజీడి, ఎలక్ట్రికల్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

పిజిఆర్‌ఎస్‌కు పది అర్జీలు

భీమునిపట్నం : స్థానిక జివిఎంసి కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో 10 అర్జీలు అందాయి.ఇంజినీరింగ్ విభాగానికి ఐదు, పట్టణ ప్రణాళిక విభాగానికి నాలుగు, రెవెన్యూకు సంబంధించి ఒక అర్జీ వచ్చినట్లు జెడ్‌సి బమ్మి అయ్యప్ప నాయుడు తెలిపారు. ఆయా అర్జీల పరిష్కారానికి సంబంధిత విభాగాలకు పంపినట్లు తెలిపారు.

ఆరు తడి వరి సాగుపై శిక్షణ

ప్రజాశక్తి -పద్మనాభం.: మండలంలో పాండ్రంగి రైతుసేవా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయంలో ఆరు తడి వరిపంట సాగుపై 60 మంది రైతులకు సోమవారం శిక్షణనిచ్చారు. ఒక ఫీల్డ్ వాటర్ ట్యూబ్ పరికరాన్ని పొలంలో పెట్టడం ద్వారా తక్కువ తడితో పంట సాగుచేయడంపై రైతులకు వివరించారు. ఫీల్డ్ వాటర్ ట్యూబ్ ప్రయోజనాలపై అవగాహన కల్పించి, దీన్ని పొలంలో వినియోగించడం ద్వారా వరి దుబ్బులో పిలకల శాతం పెరుగుతుందన్నారు. పొలం పొడిగా మారినప్పుడు నీటిలో నివసించే కొన్ని కీటకాలు,. శిలీంద్రియాల వ్యాధుల వ్యాప్తి తగ్గుతుందన్నారు. వరిలో పోటాష్ లోపంపై వివరించి, జిల్లేడు ద్రావణం తయారీపై వివరించారు. శిక్షణలో ఎఒ బి వెంకటాచలం పాల్గొన్నారు.

భారీ వర్షం

ప్రజాశక్తి- పెందుర్తి : నాయుడు తోట నుండి పెందుర్తి వరకు సోమవారం మధ్యాహ్నం రెండుగంటల పాటు ఎడతెరిపి లేని భారీ వర్షం కురిసింది. దీంతో కొండవాలు ప్రాంతాల నుండి ఒక్కసారి వర్షపు నీరు రావడంతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. కొన్నిచోట్ల నీరు వెళ్లే వీలు లేకపోవడంతో బిఆర్‌టిఎస్ రోడ్డుపై నీరు నిలిచిపోయింది. కాలువలు పొంగిపొర్లాయి.. కొన్నిచోట్ల వరి పొలాల్లోకి భారీగా వర్షపు నీరు వచ్చి చేరింది. వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. చిరువ్యాపారాలు నిలిచిపోయాయి.

ముత్రాసు కాలనీ వాసుల ధర్నా

పాడుబడిన బావిని మూయించి ఆరోగ్యాలు కాపాడాలని డిమాండ్

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి దాసరి గెడ్డ రోడ్డులోని ముత్రాసు వీధిలో సర్వే నెంబర్ 184, బ్లాకు నెంబర్ 5/3లో పాడైపోయిన నుయ్యిని మూసివేసి ప్రజల ఆరోగ్యాలను కాపాలని కోరుతూ ఆ కాలనీ వాసులు సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక జివిఎంసి జోనల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. పాడైపోయిన నుయ్యిని మూసి వేయమని జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఇచ్చినప్పటికీ జివిఎంసి జోనల్ కమిషనర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారు మండిపడ్డారు. కార్యాలయం ఎదురుగా కూర్చుని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. దీంతో స్థానిక పోలీసులు స్పందించి జీవీఎంసీ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్, ప్రజా సంఘాల రాష్ట్ర నాయకులు గూడాల సత్యనారాయణ మాట్లాడుతూ బుద్ద రమణాజీ అనే ఆసామి ఈ ఆస్తిని అక్రమంగా కాజాయాలని దురుద్దేశంతో అధికారులతో కుమ్మక్కై అక్రమాలు చేస్తున్నారని తెలిపారు. ఎస్‌సినెంబర్ 1131322002500942తో అక్రమ విద్యుత్ కనెక్షన్ తీసుకున్నారని, దీన్ని కలెక్టర్ ఆదేశాల మేరకు తొలగించడం జరిగిందని పేర్కొన్నారు. అయినప్పటికీ జీవిఎంసి అధికారులు అక్రమార్కులకు కొమ్ముకాస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. దీనిపై మళ్లీ జిల్లా కలెక్టర్కి ఫిర్యాదు చేయగా ఐదు రోజుల్లో సమస్య పరిష్కారం చేసి తమ కార్యాలయానికి తెలపాలని, మళ్ళి డిమాండ్ నోటు జీవీఎంసీ జోనల్ కమిషనర్‌కి ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఇది జరిగి మూడు రోజులయినప్పటికీ ఎటువంటి చర్యలు చేపట్టలేదని, ఇప్పటికైనా తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ నూతిలో అక్రమ బోరు వేసి దాని ద్వారా నీటిని సుదూర ప్రాంతాలకు, ప్లాస్టిక్ గొట్టాలు ద్వారా రైతులకు అమ్ముకొని డబ్బు సంపాదించుకుంటున్నారని పేర్కొన్నారు. అక్రమంగా వేసిన ఈ బోరు చాలా లోతుగా ఉండడంతో చుట్టూ వున్న వ్యక్తిగత బోర్లు, నూతుల్లో నీరు అడుగంటిపోతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాళ్ళ తేలయ్యబాబు, పి.శ్రీనివాసరావు, చింత ఓం శివ, బొడ్డు శ్రీనివాసరావు, ఎస్.దుర్గ అప్పలరాజు, డి.కాళీదాసు, చింతా అరునాథ్, ఎం. సూరిబాబు ఎ.జయలక్ష్మి, ఎం. వెంకటరమణ, ఎం.సుశీల, డి. పావని, డి.నాగు, డి.నూకరతన్నం పాల్గొన్నారు.



జివిఎంసి జోనల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం



హెచ్చరిక బోర్డులు వేస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఆక్రమణ భూమిలో హెచ్చరిక బోర్డులు

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని అమృతపురం రెవెన్యూ పరిధి సర్వేనెంబర్ 379లో సుమారు 35 ఎకరాల 64 సెంట్లు ప్రభుత్వ భూమి (గయాలు)లో ఆక్రమణలు తొలగించి తహశీల్దారు బి. చిన్నికృష్ణ ఆదేశాల మేరకు స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక ఆర్ఐ బి.వీరయ్య తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ ప్రభుత్వ భూమిని ఎవరైనా ఆక్రమించినా, నిర్మాణాలు చేపట్టినా వారిపై చట్టపరమైన క్రిమినల్ చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో జగన్నాథం, వీఆర్‌ఏ, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్‌కు 232 అర్జీలు

ప్రజాశక్తి-అనకాపల్లి : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్)కు 232 అర్జీలు వచ్చాయి. జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్, జెసి ఎం.జాహ్నవి, ప్రత్యేక ఉప కలెక్టర్ అనిత ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ అర్జీల గురించి వెంటనే సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకొని, వాటి పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అత్యధికంగా రెవెన్యూ శాఖకు చెందినవి 99 అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉప కలెక్టర్లు ఎస్ సుబ్బలక్ష్మి, రామమణి, డిఇఒ గిడ్డి అప్పారావు నాయుడు, జిల్లా గృహ నిర్మాణ, డ్వామా, డిఆర్డిఎ పీడీలు శ్రీనివాస్, పూర్ణిమ దేవి, శచి దేవి, ఎక్సైజ్ శాఖ అధికారి వి.సుధీర్ పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో


ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో 47 ఫిర్యాదులు వచ్చాయి. వాటిని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా స్వీకరించి, వాటిని తక్షణమే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు, ఎస్సై వెంకన్న, అధికారులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయి ఛార్జ్ ఇవ్వకుండా బాధ్యతలు నిర్వహించేదెలా?

- ఎంపిడిఒ ఆవేదన

ప్రజాశక్తి-కోటవురట్ల : మండల అభివృద్ధి అధికారిగా బాధ్యతలు స్వీకరించి రెండు నెలలైనా నేటికీ తనకు పూర్తిస్థాయి ఛార్జ ఇవ్వకపోవడంతో తను బాధ్యతలు ఎలా నిర్వహించాలని ఎంపిడిఒ చంద్రశేఖర్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలల క్రితం ఎంపిడిఒగా ఉన్న కాశీవిశ్వనాథం జూన్ 30న ఉద్యోగ విరమణ చేశారు. కాని కాశీవిశ్వనాథ్ తనకు పూర్తిస్థాయిలో చార్జ్ ఇవ్వలేదని ప్రస్తుత ఎంపిడిఒ చంద్రశేఖర్ వాపోయారు. ఈ మేరకు సోమవారం టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కాశీనాయుడు, మండల అధ్యక్షులు లింగన్న నాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు జనార్ధన్ వివిధ అంశాలపై మాట్లాడేందుకు ఎంపిడిఒ వద్దకు వెళ్లగా ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. క్యాష్ బుక్, మినిట్ బుక్ సహా పూర్తిస్థాయిలో చార్జ్ అప్పగించలేదని, దీనివల్ల పరిపాలనతో పాటు అభివృద్ధి కూడా కుంటుపడుతున్న విషయాన్ని నాయకుల దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని, వారి ఆదేశాల మేరకు నడుచుకుంటానని ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు.

ప్రజాశక్తిది విలక్షణ శైలి : ఎమ్మెల్యే రాజు



ప్రజాశక్తి ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

ప్రజాశక్తి-చోడవరం : రాజకీయాలకతీతంగా ప్రజలకు వార్తలు చేరవేయడంలో ప్రజాశక్తి పత్రికది విలక్షణమైన శైలి అని స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు అన్నారు. ప్రజాశక్తి 45వ వార్షికోత్సవ సంచికను తన కార్యాలయంలో సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను వెలికి తీయడంలోనూ, సమస్య పరిష్కారానికి సూచనలు ఇవ్వడంలోనూ ప్రజాశక్తి ప్రజల పక్షాన నిలుస్తుందని చెప్పారు. పత్రిక భవిష్యత్తులో మరింత ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూడూరు మల్లు నాయుడు, టిడిపి నాయకులు దేవరపల్లి వెంకట అప్పారావు, పప్పు శ్రీను, వార్డు సభ్యులు సంతోష్, మాజీ ఉప సర్పంచ్ మారిశెట్టి శ్రీకాంత్, కిలపర్తి నాయుడు, ప్రజాశక్తి డివిజన్ ఆర్గనైజర్ వై గణేష్, చోడవరం విలేఖరి కోవెల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై నిరసన

ప్రజాశక్తి-అనకాపల్లి : కొత్తగా ప్రభుత్వం రంగంలో ఏర్పాటు కానున్న వైద్య కళాశాలల ప్రైవేటీకరణ చేయాలన్న నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యాన సోమవారం అనకాపల్లి నాలుగు రోడ్ల జంక్షన్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.బాబ్జి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో 17 వైద్య కళాశాలల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదిస్తే అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డి 14 వైద్య కళాశాలకు శంకుస్థాపన చేశారని, వాటిలో ఐదు కళాశాలను ప్రారంభించారని తెలిపారు. కూటమి ప్రభుత్వం పీపీపీ విధానాన్ని తీసుకొచ్చి వైద్య కళాశాలలను కార్పొరేట్లకు కట్టబెడుతుందని దుయ్యబట్టారు. ఈ వైద్య కళాశాలల పీపీపీకి ఇవ్వనున్నట్లు రాష్ట్ర మంత్రి మండలి నిర్ణయించడం దారుణమన్నారు. దీని వల్ల వందలాది మంది ప్రతిభగల విద్యార్థులకు ఎంబీబీఎస్ విద్య దూరమౌతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అనాలోచిత నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు వి.రాజు, లత, సీత, నవ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ మహిళ వసతిగృహం ఏర్పాటు చేయాలి

అనకాపల్లి జిల్లా కేంద్రంగా కొత్తగా ఎస్సీ మహిళ వసతిగృహం ఏర్పాటు చేయాలని కోరుతూ తాడేపల్లిలో ఉన్న రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయంలో సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ లావణ్య వేణికి ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఫణీంద్ర కుమార్, నాయకులు శశి, బన్నీ, అజయ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కొణతాల సుడిగాలి పర్యటన


ప్రజాశక్తి-అనకాపల్లి : జీవీఎంసీ 81వ డివిజన్లో అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ సోమవారం సుడిగాలి పర్యటన చేశారు. జీవీఎంసీ జోనల్ కమిషనర్ సిబ్బందితో కలిసి ఇండోర్ స్టేడియం, శ్రీనూకాంబిక అమ్మవారి ఆలయ సమీపంలో ఉన్న మరిడిమాంబ అమ్మవారి ఆలయ పరిసర ప్రాంతాలలో రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణాలు, పరమేశ్వరి పార్క్ అభివృద్ధి, వాటర్ షెడ్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఇండోర్ స్టేడియంలో అసంపూర్తిగా మిగిలి ఉన్న పనులను పూర్తి చేయమని అధికారులను ఆదేశించారు. గవరపాలెం పరమేశ్వరి పార్కును అభివృద్ధి చేయాలన్నారు. వాటర్ ట్యాంక్ సమీపంలో ఉన్న స్థలంలో స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ చక్రవర్తి, సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని బంగారమ్మపాలెం పంచాయతీకి చెందిన అనారోగ్య బాధితులు ఇద్దరికీ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఏపీ కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్, టీడీపీ నియోజకవర్గం ఇన్‌ఛార్జి గండి బాబ్జి ఆదివారం అందజేశారు. బంగారమ్మ పాలెం పంచాయతీకి చెందిన యండపల్లి గౌరీ శంకర్‌కు రూ.50,250, దూరి సరోజని, శేఖర్ శివాలయం పంతులుకు రూ.70,162 చెక్కులను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ దాడి లావణ్య కన్నంనాయుడు, భరణికాన బాబురావు, కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు, దొడ్డి రాము, గవర అప్పారావు, యండపల్లి, నానాజీ, ఉమా నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలను కలిసిన శ్రీనివాసరావు

ప్రజాశక్తి-కశింకోట : టిడిపి మండల అధ్యక్షునిగా ఎన్నికైన గొంతిన శ్రీనివాసరావు సోమవారం విశాఖలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును, అనకాపల్లిలో స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పరస్పరం సత్కరించుకున్నారు. గొంతిన శ్రీనివాసరావు మరిన్ని పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉగ్గిన రమణమూర్తి, సిదిరెడ్డి శ్రీనివాసరావు, ఉల్లింగల రమేష్, నయనంశెట్టి రమణారావు, నారిపల్లి ప్రసాద్, గంజి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును కలిసిన గొంతిన శ్రీనివాసరావు

పోరాట ఫలితంగా ఎల్ఐసి ప్రీమియంపై జిఎస్‌టి రద్దు

ప్రజాశక్తి-అనకాపల్లి : కేంద్ర ప్రభుత్వం ఎల్ఐసి ప్రీమియంపై జిఎస్టి అమలు నిరసిస్తూ ఎల్ఐసి, ఏఓఐ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా అనేక నిరసనలు, ఉద్యమాలు, పార్లమెంటు సభ్యులకు వినతి పత్రాలు అందజేయడం ఫలితంగా కేంద్రం ఎల్ఐసి ప్రీమియంపై జిఎస్టి రద్దు చేయడం చేసిందని యూనియన్ నేతలు తెలిపారు. ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన 3టైమ్స్ ఉత్తమ పార్లమెంటీరియన్ అవార్డ్ గ్రహీత కీర్తిశేషులు వాసు దేవా ఆచారికి అంకితం ఇస్తూ సోమవారం అనకాపల్లి బ్రాంచ్‌లో కస్టమర్లకు ఎంప్లాయిస్‌కి, ఏవోఐ యూనియన్ నాయకులు స్వీట్స్ పంపిణీ చేసి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఏజెంట్స్ పీలా శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ ఐతా రాము, సత్యారావు, లాలం నాగేశ్వరావు, నూక అప్పారావు, నడిశెట్టి అప్పారావు దుర్గారావు, కరణం వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐలుగా ఉద్యోగోన్నతి పొందిన వారికి అభినందనలు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లాలో ఏఎస్సైగా సేవలందిస్తున్న ఎండివై.మొహిద్దీన్, ఆర్‌వి.రామనాయుడు, పి.శంకరరావు, ఎం.రాజారావుకు విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి ఎస్సైలుగా ఉద్యోగోన్నతి కల్పించిన సందర్భంగా వారు సోమవారం జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హాని మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా వారికి జిల్లా ఎస్పీ అభినందనలు తెలియజేశారు. పదోన్నతి అనంతరం మరింత బాధ్యతలతో ప్రజలకు సేవలు అందించాలని సూచించారు.

నూకాంబిక ఆలయ అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : శ్రీనూకంబిక అమ్మవారి ఆలయ అభివద్ధిపై శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ దేవాదాయ శాఖ అధికారులకు సూచనలు చేశారు. సోమవారం ఆయన అమ్మవారిని దర్శించుకున్నారు. కమిటీ, సహాయ కార్య నిర్వహణ అధికారి కొణతాలకి పూర్ణకుంభంతో స్వాగతం పలికి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి సత్కరిచారు. నూకాంబిక అమ్మవారి దేవాలయం పునర్నిర్మాణం పనులు పర్యవేక్షించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం

ప్రజాశక్తి-సబ్బవరం : సోమవారం కురిసిన భారీ వర్షానికి మండల కేంద్రంలోని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. మండల కేంద్రం సబ్బవరంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో భారీ వర్షం కారణంగా స్థానిక ఎన్టీఆర్ సర్కిల్, పాత సబ్బవరం జంక్షన్, ఆర్‌టిసి కాంప్లెక్స్, పోలీస్ స్టేషన్‌లు వర్షం నీటితో ముంపునకు గురయ్యాయి. దీనితో ఆయా కార్యాలయాల సిబ్బంది, ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు లోతట్టు ప్రాంతాలలో వర్షం నీరు నిల్వలేకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

కెజిబివిలో కంప్యూటర్ భవనం ప్రారంభం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని బేతపూడి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో నూతనంగా నిర్మించిన కంప్యూటర్ భవనాన్ని స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలికలతో మాట్లాడిన ఎమ్మెల్యే, వారి విద్యా సౌకర్యాలు, వసతి సదుపాయాలపై సమగ్రంగా విచారించారు. విద్యార్థుల ప్రతిభ, అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. రౌండ్ టేబుల్ ఇండియా స్వచ్ఛంద సంస్థ సహకారంతో కేజీబీవీలో 12 కంప్యూటర్లను సమకూర్చగలిగామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్ఓ సిహెచ్ భువనమాధురి, మాజీ ఎంపిపి కిలపర్తి భాస్కరరావు, రైవాడ జలాశయ ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ పోతల పాత్రునాయుడు, టిడిపి మండల అధ్యక్షుడు పెద్దాడ వెంకటరమణ, జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా నానాజీ, ఎస్ఎంసి ఛైర్మన్ భారతి, సర్పంచు చల్లా లక్ష్మీనాయుడు, మాజీ సర్పంచ్ చల్లా తాతీయులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : ప్రతి ఒక్కరూ గోరువెచ్చని నీటిని తాగాలని తురకలపూడి పిహెచ్సి వైద్యాధికారి సంధ్యారాణి తెలిపారు. సోమవారం మండలంలోని తైపురం విలేజ్ హెల్త్ క్లినిక్‌లో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 137 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

కొప్పుల వెలమ సంక్షేమ సంఘం ఇన్‌ఛార్జిగా రాంబాబు

ప్రజాశక్తి-పాయకరావుపేట : రాష్ట్ర కొప్పుల వెలమ సంక్షేమ సంఘం పాయకరావుపేట నియోజకవర్గ ఇంఛార్జిగా పట్టణానికి చెందిన చింతకాయల రాంబాబు నియమితులయ్యారు. ఈ మేరకు రాంబాబును నియమిస్తూ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రావు సంభంగి అదేశాలు జారీ చేశారు. రాంబాబును టిడిపి కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు, నందమూరి అభిమానులు అభినందిస్తూ పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. సంఘం బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

రీ సర్వేలో రైతుల హక్కులు కాపాడాలి

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని రావాడ రెవిన్యూ పరిధిలో ఇటీవల నిర్వహించిన రీ సర్వేలో భారీ అవకతవకలు, రికార్డుల తారుమారుతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని టిడిపి మండల అధ్యక్షుడు వియ్యపు చిన్నా తీవ్ర స్థాయిలో ఆరోపించారు. రీ సర్వేలో భూ యజమానుల ఖాతాల మేరకు భూములు కేటాయించకుండా తక్కువ ఎక్కువలు చోటు చేసుకోవడంతో గందరగోళం నెలకొందని పేర్కొన్నారు. రికార్డుల్లో పొరపాట్ల వలన రైతులు యాజమాన్యం వహిస్తున్న భూములపై హక్కులు కోల్పోతున్నారని పేర్కొన్నారు. అధికారులు సకాలంలో సరిచేయకపోవడం వలన రైతులు రోజూ ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని పరవాడ మండల తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే సరిచేస్తామని హామీ ఇచ్చారని చిన్నా పేర్కొన్నారు. రైతుల హక్కులు కాపాడేలా మళ్ళీ రీ సర్వే నిర్వహించి, ఎవరిది వాళ్లకే భూమి కేటాయించేలా రికార్డులు సవరించాలని కోరారు.

బూడిని కలిసిన పైలా

ప్రజాశక్తి-పరవాడ : మాజీ ఉప ముఖ్యమంత్రి, వైసిపి వైసీపీ మాడుగుల నియోజకవర్గ సమన్వయకర్త బూడి ముత్యాలనాయుడును సోమవారం దేవరాపల్లి తారువ గ్రామంలోని ఆయన స్వగృహంలో వైసీపీ మాడుగుల, పాయకరావుపేట నియోజకవర్గాల పార్టీ పరిశీలకుడు పైలా శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు బూడి నూతనంగా ఎంపికైన పైలా శ్రీనివాసరావును సాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు. మంగళవారం జరగబోయే రైతన్న బాసట కార్యక్రమంపై చర్చించారు. నియోజకవర్గం నుండి సుమారు 500 మంది రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నట్లు ముత్యాలనాయుడు తెలిపారు. పైలా అప్పలనాయుడు, బొడ్డపు చిన్నారావు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న లారీ

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలిలో బాలు టిఫిన్ సెంటర్ సమీపంలో సోమవారం తెల్లవారుజామున ఒక లారీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో విద్యుత్ స్తంభం ఒరిగి, వైర్లు కిందపడ్డాయి. ఆ సమయంలో అక్కడ పెద్దగా జనసంచారం లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ సంఘటనతో ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మధ్యాహ్నం వరకు ఆర్టీసీ బస్సులు కాంప్లెక్స్‌కి రాకుండా, సంత ప్రాంతం దగ్గరే నిలిపివేశారు. ఎస్ఐ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు ట్రాఫిక్‌ను వేరే దారిలో మరలించి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. విద్యుత్తును మధ్యాహ్నం సమయానికి పునరుద్ధరించారు.

మండల సమావేశంలో వైసిపి, టిడిపి సభ్యుల మధ్య వాగ్వివాదం

రాజకీయాలొద్దు.. సమస్యలపై చర్చించాలని ఎమ్మెల్యే, ఎంపిపి సూచన

ప్రజాశక్తి-కె.కోటపాడు

స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపిపి రెడ్డి జగన్మోహన్ అధ్యక్షత సోమవారం జరిగిన మండల పరిషత్తు సర్వ సభ్య సమావేశంలో వైసిపి, టిడిపి సభ్యుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. జెడ్‌పిటిసి సభ్యురాలు ఈర్లే అనురాధ మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వంలో పథకాల కన్నా సమస్యలు ఎక్కువగా ఉన్నాయన్నారు. చౌడువాడ సర్పంచ్ దాడి ఎరుకునాయుడు ఆమెకు అడ్డు తగులుతూ వైసిపి హయాంలో చేసింది తక్కువ ఆర్భాటం ఎక్కువ అంటూ... సమావేశానికి ఏనాడూ రాని జెడ్పిటిసి నేడు అల్లరి చేయడానికి వచ్చినట్లు ఉందని ఎద్దేవా చేశారు. ఈ సందర్భంలో పలువురు టిడిపి సర్పంచులు జడ్పీటీసీపై ఎదురు దాడి చేయగా, ప్రతిగా వైసిపి సభ్యులు లేవడంతో వారి మధ్య వాగ్వివాదం జరిగింది.

సమావేశం పక్కదారి పట్టకుండా గ్రామ సమస్యలపై మాట్లాడాలని ఎంపీపీ రెడ్డి జగన్మోహన్ చేసిన సూచనలను జెడ్పిటిసి పట్టించుకోకుండా ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి జోక్యం చేసుకొని గ్రామాల్లో సమస్యలపై చర్చించకుండా రాజకీయాలు మాట్లాడటం భావ్యం కాదని, ప్రభుత్వం నుండి వచ్చే పథకాలు సామాన్యులకు అందేలా చూడవలసిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని హితవుపలికారు. ఎంఈఓ సత్యనారాయణ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని చెప్పగా, ఏ కోడూరు హైస్కూల్లో 150 మంది విద్యార్థులు ఎందుకు తగ్గారని జెడ్పిటిసి ప్రశ్నించారు. ఎవరో ఇచ్చిన తప్పుడు సమాచారంతో మాట్లాడటం సరికాదని, ఈ హైస్కూల్లో కూడా విద్యార్థులు అధికంగా చేరారని ఎంఈఓ బదులిచ్చారు. మండలంలో అసంపూర్తి భవనాలకు, ఇతర మౌలిక సదుపాయాలకు ప్రతిపాదనలు తయారు చేసి పంపాల్సిందిగా ఎమ్మెల్యే అధికారులను కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీవో సాంబశివరావు, తహసీల్దార్ భుజంగరావు, పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు సమావేశ మందిరం కేటాయించాలని వినతి

కె.కోటపాడు మండలంలోని పెన్షనర్లకు సమావేశ మందిరం ఏర్పాటు చేయాలని పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు బండారు సత్యనారాయణ స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి వినతిపత్రం అందజేశారు. సోమవారం మండల పరిషత్తు సమావేశానికి వచ్చిన ఎమ్మెల్యేను పెన్షనర్ల సంఘం నాయకులు కలిశారు. తాము సమావేశం నిర్వహించుకోవడానికి ఇబ్బంది పడుతున్నామన, కె.కోటపాడులో ఏదైనా ప్రభుత్వ స్థలం ఐదు సెంట్లు కేటాయిస్తే చిన్న భవనం నిర్మించుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పెన్షనర్లు మార్కండేయులు, కె.శారోజినీభాయి, మల్లునాయుడు, శ్రీను, మరల్లయ్య పాల్గొన్నారు.

వైద్యులను డమ్మీలను చేస్తున్న ఎంపిహెచ్ఇఒ

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలో ఎంపిహెచ్ఇఒగా పని చేస్తున్న జవ్వాది సన్యాసిరావు మండల పరిషత్ సర్వ సభ్య సమావేశంలో మండలంలోని లంకవానిపాలెం, చౌడువాడ పిహెచ్సిల వైద్యాధికారులు డాక్టర్ శైలజ, డాక్టర్ మాలమనాయుడులను మాట్లాడనివ్వకుండా అంతా తానై సమాధానాలు చెప్పడం సభ్యులకు ఆశ్చర్యం కలిగించింది. సదరు వ్యక్తి గురించి తెలియక వైద్యాధికారే అనుకొని ఆరోగ్యశాఖకు సంబంధించిన పలు ప్రశ్నలను ఎమ్మెల్యే బండారు పలుమార్లు డాక్టర్ గారు అని సంబోధిస్తూ అడగ్గా తాను డాక్టర్‌ను కాదని చెప్పకపోవడంతో అధికారులు ముక్కున వేలేసుకున్నారు. హెల్త్ వర్కర్ నుండి ఎంపిహెచ్ఇఒ వరకు ప్రమోషన్లు పొంది మండలంలో ఉన్న రెండు పీహెచ్సీల్లోనే అటు ఇటు బదిలీలు చేయించుకుంటూ కాలక్షేపం చేస్తున్న ఆయన తీరుపై పలువురు విస్మయం చెందుతున్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో ఒకసారి మండల పరిషత్తు సమావేశాలకు వచ్చి సభ్యులకు సమాధానాలు ఇస్తుండగా నాటి ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు ఆగ్రహించి సదరు వ్యక్తిని బయటకు పంపించి వేశారు. సోమవారం నాటి సమావేశంలో శాఖాధిపతులు, ప్రజాప్రతినిధులే ఉండాలని ఎంపీడీవో ప్రత్యేకంగా చెప్పినా కూడా సమావేశానికి డాక్టర్లుతో వచ్చి ఇద్దరు డాక్టర్లను పక్కన పెట్టి డమ్మీలను చేసి ఎంపిహెచ్ఇఒ సన్యాసిరావు సమాధానాలు ఇవ్వడం సమంజసంగా లేదని పలువురు వ్యాఖ్యానించారు.



వైద్యాధికారులు పక్కన నిల్చొని ఉండగా, మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిహెచ్ఇఒ సన్యాసిరావు

ప్రతి రైతుకూ ఎరువులు అందిస్తాం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట మండలంలో ఎరువుల కొరత ఎక్కడా లేదని, ప్రతి రైతుకూ ఎరువులు అందిస్తామని అధికారులు తెలిపారు. బుచ్చయ్యపేటలో ఎంపీడీవో బానోజీరావు, తహసీల్దార్ లక్ష్మి, ఏవో భాస్కరరావు, ఎఎస్ఐ భాస్కర్ సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. మండలంలో వరికి 370 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా ఇప్పటివరకు 332 టన్నులు సరఫరా చేసినట్లు చెప్పారు. కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని తెలిపారు. అవసరం లేకపోయినా ఎరువులు ఎక్కువగా తీసుకుని భవిష్యత్తు అవసరాలకు దాచుకుంటున్నారని పేర్కొన్నారు. యూరియా అవసరమైన వారు మండల స్థాయి అధికారులను సంప్రదించాలని కోరారు.

గొలుగొండ : మండలంలో రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని గొలుగొండ మండల వ్యవసాయాధికారి సుధారాణి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడారు. ఇప్పటి వరకు 3400 ఎకరాల్లో వరినాట్లు పూర్తయ్యాయన్నారు. ఆర్బీకే కేంద్రాల ద్వారా 44 మెట్రిక్ టన్నుల యూరియా అందజేశామన్నారు. అలాగే ప్రైవేటు పాయింట్ల నుంచి 229 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉంచామన్నారు. ఈ నెల 11న 72 మెట్రిక్ టన్నుల యూరియా రానున్నట్లు చెప్పారు. యూరియా అందుబాటులో లేదనే అపోహలు వద్దన్నారు.

పిఎసిఎస్ ద్వారా ఎరువుల సరఫరా

కోటవురట్ల : రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పిఎసిఎస్ ద్వారా ఎరువులు అమ్మకానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు స్థానిక పిఎసిఎస్ అధ్యక్షులు అధ్యక్షులు జనార్ధన్ తెలిపారు. సోమవారం ఆయన పిఎసిఎస్ వద్ద టిడిపి జిల్లా కార్యదర్శి కాశీనాయుడు, మండల అధ్యక్షులు లింగన్న నాయుడుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా యూరియాను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు సూర్యారావు పాల్గొన్నారు.

మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు

నక్కపల్లి : వ్యవసాయ అధికారులు సూచనలు మేరకు ఎరువుల వాడాలని ఎంపీడీవో డి సీతారామరాజు రైతులకు సూచించారు. మండలంలో సోమవారం గుల్లిపాడు, దోసలపాడు, దొండకాడ, జి జగన్నాధపురం, దేవవరం గ్రామాల్లో రైతు సేవా కేంద్రాలను సందర్శించారు. రైతు సేవా కేంద్రాల్లో రైతులకు అవసరమైన యూరియాను అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు, వ్యవసాయ సిబ్బంది,పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపేద కళాకారులకు కాప్ చేయూత

ప్రజాశక్తి-అనకాపల్లి : ఏపిలోని నిరుపేద కళాకారుల ఆర్థికాభివృద్ధి, ఉపాధి కల్పనకు కాప్ (సినీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్) కృషి చేస్తుందని ప్రముఖ సినీ హాస్య నటులు భూపతిరాజు గౌతంరాజు పేర్కొన్నారు. అనకాపల్లి లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో మళ్ల జగన్నాథం కళ్యాణ మండపంలో జరిగిన 'కామెడీ కిచకిచమా' కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరైన మాట్లాడారు. కళలను, కళాకారులను అనకాపల్లి ప్రజలు విశేషంగా ఆదరిస్తారని తెలుసుకుని లాఫింగ్ క్లబ్ కార్యక్రమానికి హాజరైనట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా చిన్న, మధ్యతరహా కళాకారుల వివరాలను సేకరించి త్వరలో ప్రత్యేక డైరీని రూపొందించనున్నట్లు వెల్లడించారు. ఈ డైరీ బుల్లి తెర, సినిమా రంగాల దర్శక, నిర్మాతలకు దోహదపడుతుందని, తద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. ఆర్టీఐ, వినియోగదారుల రక్షణ చట్టాల ఉద్యమకర్త కాంగ్రెగుల వెంకటరమణ మాట్లాడుతూ అర్థతలతో సంబంధం లేకుండా అన్ని వర్గాలు ఆశ్వాదించేది ఒక్క హాస్యమేనన్నారు. ఈ సందర్భంగా గౌతంరాజు, వెంకటరమణలను లాఫింగ్ క్లబ్ ఘనంగా సత్కరించింది.

ఎస్‌సి యువకులపై జనసేన దాడికి నిరసన

ప్రజాశక్తి-దేవరాపల్లి : కైకలూరులో ఎస్సీ సామాజిక తరగతికి చెందిన యువకులపై జనసేన రౌడీ మూకలు మారణాయుధాలతో దాడి చేయడాన్ని ఖండిస్తూ అంబేద్కర్ ఆశయ సాధన సంఘం సభ్యులు దేవరాపల్లిలో సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షులు కాటపల్లి అప్పారావు మాట్లాడుతూ దాడిలో గాయపడిన కైకలూరు నియోజకవర్గంలోని దాన గూడెం ఎస్సీ యువకులకు న్యాయం చేయాలని, దాడి చేసిన వారిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం సమన్వయకర్త సబ్బవరపు మాలిబాబు, సంఘం కోశాధికారి కంచిమాల అప్పారావు, కంకడాల సన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఫేస్ వాష్‌తో డ్రైవర్ల అప్రమత్తం : సిఐ

ప్రజాశక్తి- కశింకోట : కసింకోట జాతీయ రహదారిపై సీఐ అల్లు స్వామినాయుడు ఆధ్వర్యంలో సోమవారం ఉదయం డ్రైవర్లకు ఫేస్ వాష్ కార్యక్రమం నిర్వహించారు. జాతీయ రహదారిపై వచ్చిన వాహన డ్రైవర్లకు పోలీసు సిబ్బంది మంచినీరు అందించి ముఖం శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతి డ్రైవర్ వాహనం నడిపేటప్పుడు అప్రమత్తంలో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు లక్ష్మణరావు, మనోజ్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన

ప్రజాశక్తి-కోటవురట్ల : గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం విలువల పట్ల అవగాహన కల్పించాలని ఎంఈఓ రామారావు సూచించారు. సోమవారం బికెపల్లి గ్రామంలో అంగన్వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ లింగన్న నాయుడు హాజరై మాట్లాడారు. పోషకాహార ప్రాముఖ్యతను ప్రజలందరికీ అందరికీ తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో సూపర్వైజర్ హైమావతి, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.



పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఉపాధి హామీ బకాయిలు చెల్లించాలి

ప్రజా సంఘాల ఆధ్వర్యాన ఖాళీ కంచాలతో నిరసన

ప్రజాశక్తి -కొత్తకోట:ఉపాధి హామీ పనుల బకాయిలు తక్షణమే చెల్లించాలని కోరుతూ గిరిజన సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, 5వ షెడ్యూల్ సాధన కమిటీ ఆధ్వర్యంలో పలువురు గిరిజన ఉపాధి కూలీలు చీమలపాడు శివారు అజేయపురం గ్రామంలో సోమవారం ఖాళీ కంచా లతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె. గోవిందరావు, గిరిజన సంఘం మండల నాయ కులు వంతల చిరంజీవి తదితరులు మాట్లాడుతూ, రావికమతం మండలం చీమలపాడు శివారు నేరేడుబంధ, అజేయపురం, జీలుగులోవ గ్రామాలకు చెందిన గిరిజన ఉపాధి కూలీలు చేసిన పనుల కూలి బకాయిలు ఇంత వరకూ చెల్లించక పోవడం దారుణమన్నారు. ఈ ఏడాది జూన్ నుండి ఆగస్టు వరకు పని చేసిన బకాయిలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేసారు.ఉపాధి హామీ పథకం చట్ట ప్రకారం 15 రోజుల లోపు బకాయి లు చెల్లించాలని, పే షిప్పులు సకాలంలో ఇవ్వాలన్నారు. నాన్ షెడ్యూల్ గిరిజన ప్రాంతాల్లో కొండ ప్రాంతంలో జీడి మామిడి తోటలు వేసుకుని జీవనం సాగిస్తూ ఉన్నారని, ఆ తోటలో తప్పులు, డొంకలు తొలగించేందుకు ఉపాధి హామీ పథకాన్ని అను సంధానం చేయాలన్నారు.ఎకరా జీడీ మామిడి తోటకు జంగిల్ క్లియరెన్స్ చేయాలంటే సుమారు రూ.30 వేల ఖర్చు అవుతోందని, ప్రభుత్వం దీనిపై ఆలోచన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాంగి సూరిబాబు, పాంగి శ్రీరామ్ పాల్గొన్నారు....


నినాదాలు చేస్తున్న మహిళలు


పరీక్షలు చేస్తున్న వైద్యులు

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-కొత్తకోట:రావికమతం మండలం కొత్తకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సురేఖ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎస్సి బాలుర వసతి గృహానికి చెందిన పలువురు విద్యార్థులకు వైద్య ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 90 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయగా నలుగురికి సాధారణ జ్వరం నిర్ధారణ కావడం తో మందులు పంపిణీ చేసారు. వ్యాధులు ప్రబలకుండా పలు సూచనలు చేసారు. కాచి వడపోసిన నీటిని తాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి పాతాళ రామారావు, హెచ్‌వి ఎర్రమ్మ, ఎంఎల్‌హెచ్‌పి సౌజన్య, హెల్త్ అసిస్టెంట్ గోవిందు పాల్గొన్నారు...

చీడికాడ:మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆరోగ్య సిబ్బంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గోవింద్, ఆశా కార్యకర్తలు కుమారి, కామిరెడ్డి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హాకీ జట్టు గెలుపుపై ర్యాలీ

ప్రజాశక్తి -నక్కపల్లి:భారత్ హాకీ జట్టు ఆసియా కప్ సాధించడంతో స్థానిక బలిరెడ్డి సత్యవతి హాకీ క్లబ్ క్రీడాకారులు ఆనందం వ్యక్తం చేస్తూ సోమవారం జాతీయ జెండాను చేతబట్టి ర్యాలీ చేపట్టారు. 8 సంవత్సరాల తర్వాత హాకీ ఆసియా కప్ విజేతగా భారత్ నిలవడంతో హాకీ క్రీడాకారులు సంతోషం వ్యక్తం చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. హాకీ క్లబ్ ఫౌండర్ బలిరెడ్డి సూరిబాబు, అధ్యక్షులు చిన్న అప్పారావు, కార్యదర్శి కొల్నాటి తాతాజీ, రాంబాబు, కొల్నాటి నానాజీ, రామ చంద్రరావు, రంజిత్ అభినందనలు తెలియజేశారు.


ర్యాలీ చేస్తున్న క్రీడాకారులు

10న ప్రత్యేక వైద్యశిబిరం

ప్రజాశక్తి-గొలుగొండ:ఈ నెల 10న దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల నిర్ధారణ శిబిరం నర్సీపట్నం ప్రభుత్వ హైస్కూల్ వద్ద నిర్వహిస్తున్నట్లు గొలుగొండ మండల విద్యాశాధికారులు సత్యనారాయణ, జి.కృష్ణప్రసాద్ తెలిపారు. పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష, అలింకో సంస్థ సంయుక్తంగా 0 నుండి 18 సంవత్సరాల లోపు దివ్యాంగ విద్యార్థులకు ఉచిత ఉపకరణాలు పంపిణీ కోసం ఈ గుర్తింపు శిబిరం నిర్వహిస్తుందన్నారు. శారీరక వైకల్యం గల విద్యార్థులకు మోటరైజ్డ్ బ్యాటరీ, ట్రై సైకిళ్ళు, వీల్ చైర్స్, ట్రైసైకిల్స్, సిపి చైర్స్, రోటర్స్, వాకర్స్, దృష్టి లోపం ఉన్న వారికి బ్రెయిలీ కిట్స్, వినికిడి లోపం ఉన్న వారికి వినికిడి యంత్రాలు, మేదోపరమైన వైకల్యం గల వారికి ఎంఆర్ కిట్స్ ఉచితంగా అందించడానికి శిబిరం నిర్వహిస్తుందన్నారు.

రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

స్పీకర్ అయ్యన్నపాత్రుడు



ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: రైతుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని స్పీకర్ అయ్యన్నపాత్రుడు సోమవారం జరిగిన మీడియా సమావేశంలో వెల్లడించారు. స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో మాట్లాడుతూ, నియోజకవర్గంలోని చివరి రైతు వరకు నీరు అందేలా కాలవలు శుభ్రపరిచే చర్యలు చేపట్టినట్లు చెప్పారు. నర్సీపట్నం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 10,274 హెక్టార్లలో పంటలు సాగుతున్నాయని, వాటికి 25,685 ఎకరాల మేరకు యూరియా అవసరమని వివరించారు. ఒక ఎకరానికి సగటు 75 కిలోల యూరియా అవసరం ఉంటుందని, నిర్ణీత స్థాయిలో మూడు విడతలుగా రైతులకు పంపిణీ చేస్తామని చెప్పారు. విత్తనం వేసిన 15 రోజులకు 25 కేజీలు, గడ్డి మరో 25 కేజీలు, పంట పండిన సమయంలో మూడో విడతగా 25 కేజీలు ఇవ్వబడతాయని తెలిపారు. మొత్తం 25,685 ఎకరాల కోసం 1,926 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమవుతుందని చెప్పారు. ఇప్పటివరకు రైతు భరోసా కేంద్రాలు, పిఎసిఎస్ లకు 1,055 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేశామని, అందులో 902 మెట్రిక్ టన్నులను రైతులు కొనుగోలు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం స్టాక్‌గా 152 మెట్రిక్ టన్నులు ఉండగా, మరో 15 రోజుల్లో అదనంగా 270 మెట్రిక్ టన్నులు పంపిణీ చేయనున్నట్లు స్పష్టం చేశారు. యూరియా అందుబాటులో ఉన్న కేంద్రాల వివరాలను కూడా వెల్లడించారు. ప్రభుత్వం రైతుల కోసం ఇన్ని చర్యలు తీసుకుంటున్నప్పటికీ, రాజకీయ లబ్ధి కోసం కొందరు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. గత ఐదేళ్లలో రైతుల కోసం ఏమి చేశారో వైసిపి నాయకులు చెప్పాలని ప్రశ్నించారు. ప్రతిపక్ష నాయకుడు అసెంబ్లీకి రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాండవ రిజర్వాయర్ చైర్మన్ కరక సత్యనారాయణ, గొలుగొండ మాజీ మండల పార్టీ అధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడు పాల్గొన్నారు.

యూరియా సరఫరా ఏదీ?: వైసిపి

ప్రజాశక్తి -చీడికాడ:కూటమి ప్రభుత్వం రైతులను విస్మరిస్తుందని, యూరియాను అందించడంలో విఫలమైందని వైసిపి గ్రామ పార్టీ అధ్యక్షులు ఆరోపించారు చీడికాడ మండల కేంద్రంలో వైసిపి గ్రామ పార్టీ అధ్యక్షులు పరవాడ మహేష్ తన స్వగృహం వద్ద సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రైతులు వరి నాట్లు వేసి సుమారు రెండు నెలల కావస్తున్నా అవసరమైన యూరియా రైతు సేవ కేంద్రాల్లో లభించకపోవడం బాధాకరమన్నారు. చీడికాడలో 2886 ఎకరాలు సాగుభూమి ఉందన్నారు. రైతు సేవ కేంద్రానికి వచ్చిన యూరియా కూటమి నాయకుల కనుసన్నల్లో పంపిణీ జరిగిందని మహేష్ ఆరోపించారు. గ్రామంలో రైతు సేవ కేంద్రంలో యూరియా సమయానికి దొరకక పోవడందె రైతులు ప్రైవేట్ షాపుల వద్ద వేచి బ్లాక్లో కొనుక్కోవాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైనా స్పందించి చీడికాడ రైతు సేవ కేంద్రం ద్వారా రైతులకు యూరియా అందేటట్టు చూడాలన్నారు ఈ కార్యక్రమంలో వైసిపి కార్యకర్తలు పరవాడ రామారావు, ప్రసాద్, కామిరెడ్డి గడ్డం నాయుడు, కరగానశివ, నూనెల పైడితల్లి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మహేష్

క్వారీలో బ్లాస్టింగ్‌పై దర్యాప్తు చేపట్టాలి

ఆర్‌డిఓకు సిపిఎం నేతల వినతి


వినతిపత్రాన్ని ఇస్తున్న గోవిందరావు

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని శరభవరం పంచాయతీ రాజన్నపేట గ్రామంలో నల్లరాయి క్వారీలో బాప్టింగ్‌తో ఇళ్లు బీటలు వారుతున్నాయని, దీనిపై దర్యాప్తు చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కే.గోవిందరావు కోరారు. సోమవారం నర్సీపట్నం ఆర్డీవో వివి.రమణకు వినతిపత్రం అందజేశారు. అనంతరం గోవిందరావు మాట్లాడుతూ, రాజన్నపేటకు 650 మీటర్ల దూరంలో క్వారీ ఉందన్నారు. గ్రామంలో 140 కుటుబాలు జీవిస్తున్నాయని చెప్పారు. ఈ నల్లరాయి క్వారీలో బాంబ్ బ్లాస్టింగ్ శబ్దానికి 30 కుటుంబాలకు చెందిన ఇళ్ల సన్‌సైడ్‌లు, గోడలు బీటలు బారాయన్నారు. ఐదు టీవీలు బాంబుల శబ్ధానికి పాడైయ్యాయని చెప్పారు. వీటితో పాటు ఐదు ఫ్యాన్లు కాలిపోయాయన్నారు. ఏ సమయంలో ఏం జరుగుతుందోనని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. 2025 మార్చి 24న ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా ఏడీ మైన్స్ అధికారులు క్వారీ ప్రదేశాన్ని పరిశీలన చేసి బ్లాస్టింగ్ జరగలేదని, అంతా సక్రమంగానే ఉందని చెప్పారన్నారు. ఇల్లు బీటలు వారిపోతుంటే బ్లాసింగ్ జరగలేదని తప్పుడు నివేదికలు ఇచ్చారన్నారు. తక్షణమే స్వయంగా బీటలు బారిన ఇళ్లను పరిశీలించాలని కోరారు. ఆర్డీవో స్పందిస్తూ తహశీల్దార్‌తో దర్యాప్తు చేయిస్తామని హామీ ఇచ్చారని గోవిందరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజన్నపేట గ్రామస్థులు రాంబాబు, లవ్వల సత్తిబాబు, బాధితులు పాల్గొన్నారు.


ఆలయ తలుపులు తెరుస్తున్న అర్చకులు

తెరుచుకున్న ఉపమాక వెంకన్న ఆలయం

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో ఉపమాక వెంకన్న ఆలయాన్ని సోమవారం తెల్లవారుజామున దేవస్థానం ప్రధాన అర్చకుడు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు, అర్చకులు సంకర్షణ పల్లి రాజగోపాల కృష్ణమాచార్యులు నల్లాన్ చక్రవర్తుల శ్రీనివాసులు ఆధ్వర్యంలో దేవస్థానం సిబ్బంది, తిరుమల తిరుపతి దేవస్థానం విజిలెన్స్ విభాగం సమక్షంలో తెరిచారు. సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా మూసిన స్వామివారి ఆలయ తలుపులను అనంతరం తెరిచి శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రత్యేక పూజలు చేపట్టి భక్తులకు యధావిధిగా దర్శన సౌకర్యం కల్పించారు.


దోమ తెరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాజు

దోమ తెరలు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-రావికమతం:దోమ తెరలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని చోడవరం శాసనసభ్యులు కె ఎస్‌ఎన్‌ఎస్ రాజు తెలిపారు. మండలంలో కవగుంట గ్రామంలో సోమవారం దోమతెరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, గ్రామ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తాచెదారాన్ని ప్రతిరోజు తడి చెత్త, పొడి చెత్త వేరు చేయాలన్నారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కొన్ని గ్రామాలను మలేరియా ప్రభావిత గ్రామాలుగా గుర్తించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచు దాసరి సూర్య కుమారి, మండల టిడిపి పార్టీ అధ్యక్షుడు కోమటి శంకర్రావు, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు మైచర్ల నాయుడు, ఎంపీడీవో సీతారామస్వామి, తహసిల్దార్ అంబేద్కర్ పాల్గొన్నారు.


పని చేయని సీసీ కెమెరాలు

అలంకారప్రాయంగా సీసీ కెమెరాలు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని పాకలపాడు గ్రామంలో సీసీ కెమెరాలు అలంకారప్రాయంగా మారాయి. గతంలో పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు కొంతకాలంగా పని చేయక పోవడంతో ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. పోలీసుల సూచనల మేరకు గ్రామంలో అసాంఘిక కార్యకలా పాలను, ముఖ్యంగా గంజాయి రవాణాను గుర్తించేందుకు పంచా యతీ నిధులతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. గత కొంత కాలంగా ఇవి పని చేయడం లేదని స్థానికులు తెలిపారు. గడిచిన నాలుగు రోజులుగా సీసీ కెమెరాలకు సంబంధించిన వైర్ రోడ్డుపై పడి ఉండడంతో దాని పై నుండి వాహనాలు నడుస్తున్నాయి. దీంతో ఆ వైరు పూర్తిగా దెబ్బతింది. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు వెంటనే చర్యలు తీసుకుని కెమెరాలను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

దీనిపై పంచాయతీ కార్యదర్శి నాయుడును వివరణ కోరగా గతంలో పిడుగు పడిన సందర్భంలో ఈ సీసీ కెమెరాలు మరమ్మత్తులకు గురై పని చేయడం లేదన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు తెలియజేశామని చెప్పారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించకుండా...

27న ప్రజాభిప్రాయ సేకరణ తలపెట్టడం తగదు

ప్రజాశక్తి -నక్కపల్లి: నిర్వాసితుల సమస్యలు పరిష్కారం చేయకుండా మిట్టల్ స్టీల్ ప్లాంట్ ప్రజాభిప్రాయ సేకరణ ఎలా చేస్తారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు ప్రశ్నించారు. నిర్వాసితుల సమస్యలు, వివాహితులకు ఆర్ఆర్ ప్యాకేజీ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వివాహితులు, వారి తల్లిదండ్రులతో కలిసి సోమవారం తహసిల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. వివాహితులకు ఆర్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని, నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహసిల్దార్ నరసింహమూర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, వైజాగ్ -చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం చేపట్టిన భూసేకరణలో నివాస గృహాలు కోల్పోయిన నిర్వాసిత కుటుంబాల్లో వివాహితులకు ఆర్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ అనేక రూపాల్లో నిర్వాసితులు పోరాటం చేస్తున్నప్పటికీ అధికారులు నేటి వరకు సమస్య పరిష్కరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్వాసితులు ఆర్ఆర్ ప్యాకేజీ 25 లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ, ప్రభుత్వం, అధికారులు ఏకపక్షంగా నిర్ణయం తీసుకుని 8 లక్షల 98 వేల రూపాయలు మాత్రమే ప్యాకేజీ ప్రకటించడం 2013 భూ సేకరణ చట్టాన్ని ఉల్లంఘించడమే అవుతుందన్నారు. వివాహమైన ఆడ పిల్లలకు ప్యాకేజీ ఇస్తామని ఆనాడు భూసేకరణ గ్రామ సభలలో అధికారులు హామీ ఇచ్చారని, నేడు ఏమాత్రం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. భూములు, నివాసాలు, సర్వం కోల్పోయిన నిర్వాసితులను ఆదుకోవడానికి ఉద్యోగ, ఉపాధి కల్పించడానికి స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేసి ట్రైనింగ్ ఇస్తామని రాష్ట్ర హోం మంత్రి అనిత ప్రకటించారని, నేటికీ కార్యరూపం దాల్చ లేదని విమర్శించారు. నిర్వాసితులకు ఆర్ కార్డు లు కూడా ఇవ్వలేదన్నారు.సాగు భూములకు, సాగు, డీఫారం భూములలో తోటలకు, చందనాడ దళితుల భూములకు, బావులకు, బోర్లకు నేటికీ పరిహారం చెల్లించలేదని దుయ్యబట్టారు. బోయపాడు, రాజయ్య పేట,డి.ఎల్ పురం మత్స్యకారులు కోరిన మేరకు పునరావాసం కల్పించలేదన్నారు. ఇవేమి పట్టించుకోకుండా ప్రభుత్వం, అధికారులు ఈనెల 27న ఆర్సెలార్ మిట్టల్, నిప్పన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు కోసం ప్రజాభిప్రాయ సేకరణ తల పెట్టారని, సమస్యలు పరిష్కరించకుండా ఎలా చేపడతారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. చట్టాలను, న్యాయ స్థానాల తీర్పు లను గౌరవించి కుండా కార్పోరేట్ కంపెనీల కోసం ఈ విధంగా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం సమంజసం కాదన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాసితులు యు.రమేష్, పి.వాణి, టి.వెంకటలక్ష్మి, పి.శ్రీదేవి, ఎం.నాగదుర్గ, ఎం.కుమారి, ఎస్.నూకరత్నం, పి.సూర్యవతి పాల్గొన్నారు

-వివాహితులకు ఆర్ఆర్ ప్యాకేజీ చెల్లించాలి -సిపిఎం ఆధ్వర్యాన ఆందోళన



ఆందోళన చేస్తున్న అప్పలరాజు, నిర్వాసితులు

ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉప కార్యదర్శి జి గౌతమ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, చలో విజయవాడ కార్యక్రమంలో విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలంటూ తీర్మానం చేయడం జరిగిందన్నారు. హాస్టల్ విద్యార్థులకు మెస్ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని విమర్శించారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించకపోగా లాఠీఛార్జ్ చేయించడం చాలా దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలలో విద్యార్థులకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయకపోగా విద్యార్థులను శిక్షించడం సరైన పద్ధతి కాదన్నారు.ఎన్నికలో ఇచిన హామీలను నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యల ను తీర్చకపోతే ఎస్ఎఫ్ఐ ద్వారా పోరాటాలకు వెనకడబోమని తెలియజేశారు.

అన్నదాత పోరును జయప్రదం చేయాలి

ప్రజాశక్తి -చీడికాడ:అనకాపల్లి ఆర్డీవో కార్యాలయం ఎదుట ఈనెల 9వ తేదీన జరిగే అన్నదాత పోరు నిరసన కార్యక్రమానికి రైతులందరూ తరలి రావాలని వైసిపి మండల పార్టీ అధ్యక్షుడు గొల్లవిల్లి రాజబాబు కోరారు. ఈ మేరకు చీడికాడ మండలం జైతవరం గ్రామంలో వైసీపీ నాయకుల సమక్షంలో సోమవారం ఆయన మాట్లాడుతూ, వరి నాట్లు వేసిన రైతులకు సకాలంలో ఎరువుల పంపిణీలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో సిడిసి ఛైర్మన్ సుంకర శ్రీనివాసరావు, వైసీపీ మండల నాయకులు స్వామి నాయుడు, పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: ఈ నెల 9న నర్సీపట్నంలో అన్నదాత పోరు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్గణేష్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రైతులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు, కార్యకర్తలు, రైతులు తరలి రావాలన్నారు.

భూ శిస్తుదారులకు అనుమతిపత్రాలు అందజేత

ప్రజాశక్తి -కశింకోట : మండలంలో వెదురుపర్తి శ్రీవేణుగోపాల్ స్వామి దేవస్థానం భూమి వేలంలో శిస్తు పాడుకున్న వారికి దేవస్థానం ఈవో సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం అనుమతి పత్రాలు అందజేశారు. గత నెలలో దేవస్థానం భూములకు సంబంధించి శిస్తు కోసం వేలం పాట నిర్వహించడం జరిగింది. వేలం ఖరారు అయిన వారికి భూమి వద్ద అనుమతి పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ మణి కుమారి, రైతులు పాల్గొన్నారు.

రాజారావుకు ఘన నివాళి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ప్రజానాట్యమండలి వ్యవస్థాపకులు గరికపాటి రాజారావు 62వ వర్ధంతిని సోమవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి ఉత్తరాంధ్ర పట్టభద్రుల మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ, ప్రజాశక్తి బుక్ హౌస్ రాష్ట్ర జనరల్ మేనేజర్ లక్ష్మయ్య, ప్రజానాట్యమండలి విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.చంటి పూలమాలవేసి నివాళ లర్పించారు. ఈ సందర్భంగా గురజాడ సాంస్కృతిక వేదిక కార్యదర్శి దండు నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఎంతోమంది కళాకారులను తీర్చిదిద్ది, ప్రజ చైతన్యానికి అహర్నిశలు కృషిచేసిన గరికపాటి రాజారావు ఆశయ సాధన కోసం, ప్రజానాట్యమండలి ఇతర కళ సంఘాలను, సంస్థలను కలుపుకుంటూ సమాజ మార్పు కోసం పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గరికపాటి రాజారావు బాటలో నడవడమే ఆయనకి అర్పించే ఘన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు జి.రమణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్జె.నాయుడు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు యుఎస్ఎస్.రాజు, బిఎన్ఆర్ భవన్ ఫౌండేషన్ నాయకులు బుజ్జి, జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్, ప్రజాశక్తి బుక్ హౌస్ ఇన్ఛార్జి శంకర్ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎంవిఎస్.శర్మ తదితరులు

విద్యతోనే ఉన్నత భవిష్యత్తు



బోచర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు, నాయకులు

ప్రజాశక్తి -నక్కపల్లి:విద్య తోనే ఉన్నత భవిష్యత్తు ఉంటుందని పలువురు అధికారులు, నాయకులు అన్నారు. నక్కపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్ఎం విజయ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టారు.ఈ కార్యక్రమంలో వయోజన విద్య ఏడి చిన్ని కృష్ణ, ఎంపీడీవో డి సీతారామరాజు, మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ దేవర సత్యనారాయణ, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు, ఎంఈఓలు నరేష్, నాగన్న దొర, వెలుగు ఏపీఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్:స్థానిక శాఖ గ్రంధాలయంలో ప్రపంచ అక్షరాస్యత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సోమవారం గ్రంధాలయధికారిణి పి.దమయంతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఈ సందర్భంగా విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభాకర్, పాఠకులు, యువతీ పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ప్రపంచ అక్షరాస్యతా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ పి సురేఖ మాట్లాడుతూ, స్థిరమైన సమాజాన్ని సృష్టించడానికి అక్షరాస్యత కీలక పాత్ర వహిస్తుందన్నారు. 2025 ఏడాదికి యునెస్కో డిజిటల్ యుగంలో అక్షరాస్యతను ప్రోత్సహించడం అనే థీమ్ ను ప్రకటించిందన్నారు. ఇంగ్లీష్, తెలుగు విభాగాల అధిపతులు మాధురి, డి ప్రవీణ, ఐక్యూఎసి కోఆర్డినేటర్ ప్రసాదరావు పాల్గొన్నారు.

విద్యార్థులపై లాఠీఛార్జిని ఖండిస్తూ నిరసన

ప్రజాశక్తి-అనకాపల్లి : విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమం సందర్భంగా విద్యార్థులపై ప్రభుత్వం లాఠీ ఛార్జ్ చేయడాన్ని ఖండిస్తూ ఆ సంఘం ఆధ్వర్యాన సోమవారం అనకాపల్లిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కన్వీనర్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ న్యాయం కోసం పోరాడుతున్న విద్యార్థులపై కూటమి ప్రభుత్వం చాలా దారుణంగా ప్రవర్తించిందని పేర్కొన్నారు. పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ రూ.6700 కోట్లు విడుదల చేయాలని, హాస్టల్ విద్యార్థులకు మెస్ ఛార్జీలు రూ.3000కు పెంచాలని, ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో విద్యార్థి సంఘాలకు అనుమతిని ఇస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని, జీవో నెంబర్ 77ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ చలో విజయవాడ చేపట్టినట్లు చెప్పారు. ప్రభుత్వం సమస్యలను పరిష్కరించక పోగా విద్యార్థులపై లాఠీఛార్జ్ చేయించడం దారుణమన్నారు. ఇప్పటికైనా విద్యార్థుల సమస్యలను పరిష్కరించకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పేర్ల రాము, లక్ష్మణ్, కృపానంద, అజయ్, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన నిరసన తెలుపుతున్న విద్యార్థులు



విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందించిన కలెక్టర్, జెసి

వ్యాస రచన పోటీల్లో విజేతలకు ప్రశంసా పత్రాలు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో 40వ నేత్రదాన పక్షోత్సవాలలో భాగంగా నేత్రదాన అవశ్యకత, నేత్రదాన ప్రాముఖ్యత గురించి జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో విజేతలైన వారికి సోమవారం కలెక్టరేట్ ఛాంబర్లో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, సంయుక్త కలెక్టర్ జాహ్నవి చేతులు మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ టి డేవిడ్ కుమార్, బోడ మోహన్రావు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వరద ముంపుతో వరి పంటకు నష్టం

ప్రజాశక్తి-దేవరాపల్లి : వర్షాలు కారణంగా వరద ముంపు వల్ల అన్నదాతలు అగచాట్లు పడుతున్నారు. మండలంలోని చిన్న నందిపల్లి రెవెన్యూ పరిధిలో సుమారు 8 ఎకరాల వరి పొలాలు ముంపునకు గురయ్యాయి. బోడిదొర చెరువు కలువ పూడిక పోవడంతో చెరువు గర్బం నిండిపోయి వరద నీరంతా పొలాల్లోకి చేరడంతో వరి పంట ముంపునకు గురైంది. దీంతో రైతులు వేరే దారి లేక తమ సొంత నిధులతో కాలువ పూడిక తీత పనులు జెసిపితో సోమవారం తీయించారు. వరి పంట ముంపునకు గురికావడంతో చేను కుళ్ళిపోయి ఎందుకూ పనికి రాకుండా పోయిందని బాధిత రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం తమ పంటలను పరిశీలించి తగిన నష్టపరిహారం అందించాలని రైతులు కోరారు.



ముంపునకు గురై కుళ్లిపోయిన వరి దుబ్బులు చూపిస్తున్న రైతు